Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU




అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 296 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శుక్రవారం, 10 - 7 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# ప్రజల ఆస్తిపై ప్రజలకే అధికారం

**- 2027 మార్చికి 72 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు - వైసీపీ తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ నల్లచట్టమే - పాస్ పుస్తకాలు, సర్వేరాళ్లపై ఫోటోల పిచ్చిని రాజముద్రతో తుడిచేశాం - పురాణాల్ని దూషించి, పాకిస్తాన్‌ను సమర్ధించిన రావణ్‌కు వైసీపీ ఆర్థిక సాయం - ఓట్ల కోసం తండ్రి సమాధికి పూజలు చేస్తూ, బతికి ఉన్న తల్లికి ఆస్తి ఇవ్వక క్షోభ పెడుతున్నారు - బనగానపల్లె మీ భూమి మీ హక్కు బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు**






**బనగానపల్లె, (రాజధాని వార్తలు):** ప్రజల ఆస్తిపై ప్రజలకే అధికారం ఉండేలా రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం స్పష్టం చేశారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో మీ భూమి– మీ హక్కు కార్యక్రమంలో భాగంగా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను ముఖ్యమంత్రి పంపిణీ చేశారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతూ.. "గడచిన రెండేళ్లుగా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ప్రజలకు అందుతోంది. గత పాలకుల పాపాలు ప్రజలకు శాపాలుగా మారాయి. లక్షల కుటుంబాలు వారి అరాచకానికి బలి అయ్యాయి. నచ్చని వారిని భయపెట్టేందుకు వారి భూముల్ని గత పాలకులు 22ఏ కింద చేర్చారు. వివాదాలు సృష్టించి భూములు లాక్కునేందుకు ప్రయత్నాలు చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పేరిట ఓ నల్ల చట్టాన్ని తెచ్చారు. ప్రజల ఆస్తుల్ని కాజేసేలా భయాందోళనలు సృష్టించారు. ఈ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు తేవటమే సమస్యను మరింత జఠిలం చేసింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ నల్ల చట్టాన్ని రద్దు చేశాం. భూ వివాదాల పరిష్కారానికి ధృఢ సంకల్పంతో ముందుకు వెళుతున్నాం. గత పాలకులు ప్రజల భూమి పత్రాలపైన, సర్వే రాళ్లపైనా ఫోటోలు ముద్రించుకున్నారు. ఆ ఫోటోల పిచ్చిని తుడిచేసేందుకు రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేస్తున్నాం. కట్టుదిట్టమైన భద్రతా ఫీచర్లను పెట్టి తప్పులు లేకుండా రైతులు, భూ యజమానులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నాం. ఇదో ఉద్యమంగా, పవిత్రమైన కార్యక్రమంగా చేపట్టి భూ యజమానులకు హక్కులు కల్పిస్తున్నాం. 2027 మార్చి నాటికి 9833 గ్రామాల్లో 72,70.,605 పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ చేస్తాం. ఏపీని ఎలాంటి భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రజా ప్రభుత్వ లక్ష్యం. విలేజ్ ఇనామ్ భూములను కూడా 22ఏలో పెట్టేశారు. వీటిని 1971 గ్రామాల్లో రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేశాం. ఆటో మ్యూటేషన్ ద్వారా వారసత్వ ఆస్తుల్ని సంబంధిత వ్యక్తులకు చెందేలా చేస్తున్నాం. తిరుపతి జిల్లా శెట్టిపల్లి, గుంటూరులోని వట్టి చెరుకూరు, చిత్తూరు జిల్లా కంగుందిలో చాలా ఏళ్లుగా ఉన్న భూ వివాదాలను పరిష్కరించాం. డోన్ నియోజకవర్గంలో ఉన్న 2074 ఎకరాల వక్ఫ్ భూముల్ని కూడా 22ఏలో గత పాలకులు పెట్టారు. ఆ భూముల్ని 22ఏ జాబితా నుంచి తొలగించి రైతుల సమస్యల్ని పరిష్కరించాం." అని సీఎం అన్నారు.

**వారు రాసింది రక్త చరిత్ర- మాది అభివృద్ధి సంకల్పం**

"రాష్ట్ర వ్యాప్తంగా భూసమస్యల్ని పరిష్కరించటంతో పాటు అన్ని ప్రాంతాల అభివృద్ధికి పనిచేస్తున్నాం. రాయలసీమ ముఖ చిత్రాన్ని మారుస్తున్నాం. కడప స్టీల్ ప్లాంట్, హీరో మోటార్స్, అమ్కా డిఫెన్సు ఫైటర్ జెట్ ప్లాంట్ ఏర్పాటు అవుతోంది. డిఫెన్సు, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ తదితర రంగాల్లో ప్రాజెక్టులు, ఉద్యోగ ఉపాధి అవకాశాలతో రాయలసీమ రతనాల సీమగా మారుతుంది. రాయలసీమలో తయారైన ఎన్ ఫీల్డ్ బుల్లెట్‌లు దేశమంతా తిరుగుతాయి. రూ.40 వేల కోట్ల ప్రభుత్వ పెట్టుబడులు, ప్రైవేటు పెట్టుబడులతో రాయలసీమ హార్టీ కల్చర్ హబ్‌గా మారుతుంది. నగరాలు, పట్టణాల కంటే కడప జిల్లా లింగాల వంటి ప్రాంతాల్లోనే తలసరి ఆదాయం ఎక్కువ ఉంది. నంద్యాలలోనూ హార్టికల్చర్ అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. ఎల్ నినో కారణంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సీజన్‌లో 22 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. నీటిని పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. అందుకే జలధార కార్యక్రమాన్ని కూడా రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించాం. నంద్యాల జిల్లాలో 18 కిలోమీటర్ల ఫీడర్ ఛానల్, చెక్ డ్యామ్‌లు నిర్మించిన జిల్లా యంత్రాంగానికి అభినందనలు. వర్షపు నీటిని భూగర్భజలాలుగా మార్చుకుంటే నీటి భద్రత సాధ్యం అవుతుంది. రాయలసీమలో వారు రక్త చరిత్ర రాస్తే మేం అభివృద్ధి సంకల్పం చేస్తున్నాం. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందించటమే లక్ష్యంగా కూటమి ప్రజా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోంది. ప్రజలకు అందిస్తున్న పథకాలు, కార్యక్రమాలు, సేవలపై ప్రజల నుంచి అభిప్రాయాలు తెలుసుకుని దానికి అనుగుణంగా పనితీరు మెరుగు పర్చుకుంటున్నాం. ప్రజలకు అత్యుత్తమ సేవలను అందించటమే ప్రభుత్వ లక్ష్యం. బాగా పనిచేసిన అధికారులను అభినందిస్తున్నాను. రాష్ట్రంలో మహిళల భద్రతకు పెద్ద పీట వేస్తున్నాం. ఎవరు అఘాయిత్యానికి పాల్పడినా అదే వారికి చివరి రోజు అవుతుంది. రాష్ట్రంలో అత్యుత్తమ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేసి మెరుగైన విద్య, జీవన ప్రమాణాలు అందించాలని ఆలోచన చేస్తున్నాం." అని సీఎం స్పష్టం చేశారు.

**హే రామ్ అంటూ రావణుడికి సమర్థనా?**

"కుట్రలు కుతంత్రాలతో కులం, మతం, ప్రాంతం, వర్గాలతో సమాజాన్ని విడగొట్టాలని గొడ్డలి పార్టీ ప్రయత్నం చేస్తోంది. గంజాయి బ్యాచ్‌ను, బ్లేడ్ బ్యాచ్‌లను, రౌడీయిజాన్ని వైసీపీ ప్రోత్సహిస్తూ రాష్ట్రంలో విధ్వంసం చేస్తోంది. అంతర్వేది రథం దగ్ధం, దుర్గమ్మ గుడిలో వెండి సింహాల చోరీ, రామతీర్థంలో రాముడి విగ్రహం ధ్వంసం చేసినా గత పాలకులు నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గత పాలకులు తిరుపతి వెంకన్న ప్రసాదాన్ని కల్తీ చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీశారు. ఇలాంటి ఘోరాలు చాలా చేశారు. ఇలాంటి వాటిని ప్రక్షాళన చేస్తున్నాం. రెండు రోజుల క్రితం ఆదోనిలో శివాలయంలోని దీపంలో ఓ దుర్మార్గుడు సిగరెట్ వెలిగించి అపచారం చేశాడు. వెంటనే కేసు పెట్టి నిందితుడ్ని అరెస్టు చేశాం. మత విద్వేషాలు రగిలించేలా ఎవరు దుశ్చర్యకు పాల్పడినా కూటమి ప్రభుత్వం క్షమించదు. సామాజిక మాధ్యమాల్లో కొందరు దుర్మార్గాలకు పాల్పడుతున్నారు. రావణ్ అనే వ్యక్తి పురాణాల్ని దూషిస్తాడు, మన రాముడిని, సీతపై నీచంగా మాట్లాడతాడు. తీవ్రవాదాన్ని, పాకిస్తాన్‌ను సమర్థిస్తాడు. అలాంటి వారికి గొడ్డలి పార్టీ ఆర్థిక సాయం అందిస్తుంది. ఎంతటి బరితెగింపు ఇది. ప్రజలు దీనిని గుర్తించాలి. వారి పోకడలు ఏమిటో తెలుసుకోవాలి. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తినే దూషిస్తున్న వారికి సామాన్య ప్రజలు ఏం లెక్క. తిరుమలకు వెళ్లి డిక్లరేషన్ ఇమ్మంటే వాటిని తిరస్కరించి అపచారం చేశారు. నేను చర్చికి వెళ్లినా, మసీదుకు వెళ్లినా అక్కడి మతాచారాలను గౌరవిస్తాను. హే రామ్ అంటూ రావణుడ్ని ప్రోత్సహిస్తున్న వ్యక్తులను ఏమనాలో తెలీడం లేదు. కాలజ్ఞానం రాసిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కూడా ఇలాంటి వింతలు విచిత్రాలు జరుగుతాయని చెప్పారు. మతవిద్వేషాలు ఎవరు రెచ్చగొట్టే ప్రయత్నం చేసినా చూస్తూ ఊరుకోం. నంద్యాలలో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తి వైసీపీకి చెందిన వాడే అని తెలిసి తోక ముడిచారు. ఓట్లు కోసం తండ్రికి పూజలు చేస్తున్నాడు. బ్రతికి ఉన్న తల్లికి మాత్రం ఆస్తి ఇవ్వకుండా క్షోభ పెడుతున్నాడు. ఇలాంటి వ్యక్తులు మన సమాజానికి అవసరమా. తల్లికి గౌరవం ఇవ్వని వ్యక్తులు మనకు ఎందుకు?" అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. అనంతరం బహిరంగ సభా వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం పరిశీలించారు. వెదురుతో తయారు చేసిన ఆభరణాలను సీఎం ఆసక్తిగా పరిశీలించారు. డ్వాక్రా, మెప్మా మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులను స్వయం బ్రాండ్ పేరిట మార్కెటింగ్ చేయాలని సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్ధన్ రెడ్డి, ఎన్ఎండీ ఫరూఖ్, ఎంపీ బైరెడ్డి శబరి, జిల్లా ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

# డాక్టర్ శ్రీనివాస్ రావుకు లెగసీ హ్యూమానిటేరియన్ అవార్డు

## - న్యాయ సేవల్లో నాయకత్వానికి కావేటికి అంతర్జాతీయ గుర్తింపు






**(రాజధాని వార్తలు):** కావేటి లా ఫర్మ్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ అటార్నీగా, రామ్సేయర్ అండ్ అసోసియేట్స్ పి.సి. సంస్థలో ఉపాధ్యక్షుడిగా సేవలందిస్తున్న డాక్టర్ శ్రీనివాస్ రావు కావేటి కి కెనడా లెగసీ హ్యూమానిటేరియన్ అవార్డు ఫర్ గ్లోబల్ అడ్వకసీ ప్రదానం చేశారు. న్యాయవృత్తి, మానవ హక్కుల పరిరక్షణ, మానవతా సేవలు అంతర్జాతీయ న్యాయ నాయకత్వంలో ఆయన చేసిన విశిష్ట కృషికి అంతర్జాతీయ పురస్కారాలు, గౌరవాలను అందుకున్నారు. డాక్టర్ కావేటి అంతర్జాతీయ న్యాయ రంగంలో చూపిన నాయకత్వం, వ్యక్తులు, వ్యాపార సంస్థలు, సంస్థాగత సంస్థలకు సంక్లిష్టమైన అంతర్జాతీయ న్యాయ సమస్యల పరిష్కారంలో అందించిన సేవలకు గాను ఇంటర్నేషనల్ కౌన్సెల్ లీడర్‌షిప్ అవార్డును కూడా అందుకున్నారు. మానవ హక్కులు, న్యాయ విద్య అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించడంలో ఆయన చేసిన కృషికి గ్లోబల్ హ్యూమన్ రైట్స్ లీడర్‌షిప్ అవార్డుతో సత్కరించబడ్డారు. డాక్టర్ కావేటి హైదరాబాద్‌లో విద్యాభ్యాసం పూర్తి చేశారు. మూడు దశాబ్దాలకు పైగా అంతర్జాతీయ న్యాయ రంగంలో సేవలందిస్తున్న ఆయన న్యాయ సేవలు అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, భారతదేశం, కెనడా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి అనేక దేశాలకు విస్తరించాయి. వలస చట్టాలు, అంతర్జాతీయ న్యాయం, కార్పొరేట్ చట్టం, వ్యాజ్యాలు, మధ్యవర్తిత్వం, కుటుంబ చట్టం, స్థిరాస్తి చట్టం వంటి పలు విభాగాల్లో ఆయన విశేష అనుభవాన్ని సంపాదించారు. భారతదేశంలో న్యాయ విద్యను పూర్తి చేసిన అనంతరం, డా.కావేటి ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ యూనివర్శిటీ ఆఫ్ టెక్నాలజీ నుండి అంతర్జాతీయ వ్యాపారం, వాణిజ్యం పన్నుల చట్టాల్లో మాస్టర్ ఆఫ్ లా పట్టాను పొందారు. అనంతరం యునైటెడ్ కింగ్‌డమ్‌లో సొలిసిటర్‌గా అర్హత సాధించారు. తర్వాత అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ఉన్నత న్యాయ విద్యను అభ్యసిస్తూ, కృత్రిమ మేధస్సు, న్యాయ వ్యాజ్యాలపై ప్రత్యేక దృష్టితో న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. అంతర్జాతీయ స్థాయిలో ఆయనకు లభించిన గౌరవాలలో నెల్సన్ మండేలా అవార్డు, గ్లోబల్ హ్యూమన్ రైట్స్ లీడర్‌షిప్ అవార్డు, అలాగే ఇంటర్నేషనల్ కౌన్సెల్ లీడర్‌షిప్ అవార్డు 2024 ముఖ్యమైనవి.

## పోలవరం టూరిజం హబ్ డిజైన్లపై మంత్రి నిమ్మల సమీక్ష



**అమరావతి, (రాజధాని వార్తలు):** పోలవరం టూరిజం హబ్‌కు సంబంధించిన అధికారులతో పాటు జపాన్ నిప్పాన్ కోయి ఏజెన్సీ ప్రతినిధులతో ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోలవరం టూరిజం హబ్ డిజైన్లపై ఆయన కీలక చర్చ చేశారు. ఈ సమావేశానికి ఇరిగేషన్ అడ్వైజర్ వేంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి, ఆర్కిటెక్టులు, ఏజెన్సీల ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. సమీక్షా సమావేశం అనంతరం మీడియాతో మంత్రి నిమ్మల మాట్లాడారు. ఈ సందర్భంగా పోలవరం టూరిజం హబ్ డిజైన్లు తుది దశకు చేరుకున్నాయని మంత్రి నిమ్మల తెలిపారు. ఈ నెల 13న పోలవరం పర్యటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వస్తున్నారని, పనుల పురోగతిపై ఆయన సమీక్ష చేస్తారని నిమ్మల వెల్లడించారు. అదే రోజు పోలవరం టూరిజం హబ్‌కు సంబంధించిన డిజైన్లను పరిశీలించి సీఎం ఫైనల్ చేస్తారని వెల్లడించారు. ఈ మేరకు తెలుగుతనం ఉట్టిపడేలా, రాష్ట్ర ఔన్నత్యాన్ని చాటేలా పోలవరం స్పిల్‌వే ఉండాలని సీఎం చంద్రబాబు చెప్పారన్నారు. పోలవరం ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేందుకు లైడార్ సర్వే ద్వారా 10 వేల ఎకరాలను గుర్తించామని మంత్రి పేర్కొన్నారు. మరోవైపు NH-365GB నుంచి NH-516Eను పోలవరం ప్రాజెక్టుకు అనుసంధానించేలా నేషనల్ హైవేస్ అథారిటీతో చర్చిస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నుంచి పాపికొండలు మీదుగా భద్రాచలం వరకు టూరిజం హబ్‌గా మార్చేలా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. గోదావరి ఔన్నత్యాన్ని చాటేలా మ్యూజియం, వాటర్ స్పోర్ట్స్, టెంపుల్ టూరిజం, రిసార్ట్స్, హట్స్, అమ్యూజ్‌మెంట్ పార్కులు అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు ఆయన వెల్లడించారు.

# వేస్ట్ పికర్స్ గౌరవప్రదంగా జీవించేందుకు చర్యలు

**- వ్యర్థాలకు మంచి రేటు వచ్చే ఏర్పాట్లు - నమస్తే పథకం అమలు - డ్వాక్రా సంఘాల తరహాలో వేస్ట్ పికర్స్ గ్రూపులు వాహనాలకు రుణాలు - చెత్త ప్రాసెసింగ్‌లో వారికి అధిక లబ్ది - స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్**



**గుంటూరు, (రాజధాని వార్తలు):** వేస్ట్ పికర్స్ (వ్యర్థాలను సేకరించే వారు) సమాజంలో గౌరవప్రదంగా జీవించే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ చెప్పారు. గుంటూరులోని దళిత బహుజన రీసోర్స్ సెంటర్ (డీబీఆర్సీ) ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వేస్ట్ పికర్స్‌తో గురువారం ఆయన ముఖాముఖి మాట్లాడారు. వ్యర్థాల సేకరణ, వాటి అమ్మకాలు, ఒక రోజుకు వచ్చే ఆదాయం, రోజు వారీ ఎదురయ్యే సమస్యలు వారిని అడిగి తెలుసుకున్నారు. వాటర్ బాటిల్స్, అట్టలు, న్యూస్ పేపర్, పాత ఇనుము వంటి వాటికి వ్యాపారులు తగిన ధర ఇవ్వడం లేదని వేస్ట్ పికర్స్ చెప్పారు. వర్షా కాలంలో ధరలు మరీ తక్కువగా ఇస్తారన్నారు. ఉదయాన్నే లేచి ఖాళీ వాటర్ బాటిళ్లు, పేపర్లు ఏరుకునేవారు ఎంతమంది? ఆధార్ కార్డులు ఎంతమందికి ఉన్నాయి? బ్యాంక్ అకౌంట్ ఎంతమందికి ఉంది? .. వంటి వివరాలను పట్టాభిరామ్ వేస్ట్ పికర్స్‌ని అడిగి తెలుసుకున్నారు. వేస్ట్ పికర్స్ సేకరించే వ్యర్థాలకు వారికి వచ్చే ధర, ఆ వ్యర్థాలు రీసైక్లింగ్ కేంద్రాలకు వెళ్లే సరికి నాలుగు రెట్లు పెరుగుతుందని చైర్మన్ పట్టాభిరామ్ తెలిపారు. మధ్యలో దళారులు లేకుండా వారికి ఎక్కువ ధర వచ్చే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఎన్యూమరేషన్ చేసి, వారి జీవన విధానం మెరుగుపరిచి, తగిన గుర్తింపు కల్పిస్తామన్నారు. అదేవిధంగా, వారు సేకరించే వ్యర్థాలను మంచి రేటుకు కొనుగోలు చేయడం ద్వారా వారి ఆదాయం పెంచే ఏర్పాట్లు చేస్తామన్నారు. నమస్తే స్కీమ్ ద్వారా వారందరిని ఒకే తాటిపైకి తీసుకువచ్చేందుకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చర్యలు తీసుకుంటుందని పట్టాభిరామ్ చెప్పారు. వారికి హెల్త్ ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. వేస్ట్ పికర్స్ ఆధ్వర్యంలో త్వరలో స్టాక్ పాయింట్స్ ఏర్పాటు చేసి, వాటిని రీసైక్లింగ్ పరిశ్రమలతో అనుసంధానం చేస్తామని పట్టాభిరామ్ చెప్పారు. చెత్త ప్రాసెసింగ్‌లో చెత్త సేకరించేవారికి అధిక లబ్ది చేకూరేలా చర్యలు తీసుకుంటామన్నారు. అవమాన కరంగా చూసే పరిస్థితుల నుంచి వారు గౌరవంగా జీవించే విధంగా వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తామని చెప్పారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా డ్వాక్రా సంఘాల తరహాలో వేస్ట్ పికర్స్ గ్రూపులు ఏర్పాటు చేస్తామన్నారు. ఆ గ్రూపుల ద్వారా రుణాలు అందజేసి, వారికి వాహనాలు సమకూర్చే ఆలోచన ఉన్నట్లు తెలిపారు. చెత్త సేకరణ వ్యవస్థని మరింత శాస్త్రీయంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సమగ్ర అధ్యయనం చేస్తుందన్నారు. ఈ ప్రక్రియలో క్షేత్ర స్థాయిలో నిత్యం పనిచేస్తున్న వేస్ట్ పికర్ల అభిప్రాయాలు, సూచనలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. వేస్ట్ పికర్ల సంక్షేమం విషయంలో డీబీఆర్సీ వంటి సంస్థలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నట్లు చైర్మన్ పట్టాభిరామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీబీఆర్సీ కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడి దేవకుమార్, ప్రోగ్రామ్స్ మేనేజర్ సీహెచ్ శామ్యూల్ అనిల్ కుమార్, ఫైనాన్స్ మేనేజర్ జి.నాగలక్ష్మి, బయో డిగ్రేడబుల్ ఉత్పత్తుల ఉత్పత్తిదారు హేమ సాయిబాబు, రాష్ట్ర నలుమూలల నుంచి వేస్ట్ పికర్లు పాల్గొన్నారు.

# ఎల్‌నినోపై రైతులకు అవగాహన కల్పిస్తాం.. సమస్యను అధిగమిస్తాం : నాదెండ్ల మనోహర్



**విజయవాడ, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వంలో రెండేళ్ల ధాన్యం సేకరణ విజయవంతంగా పూర్తవడంపై పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతులు, రైస్ మిల్లర్లతో ప్రత్యేక సెమినార్ నిర్వ హించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లా డుతూ.. గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో వినూత్న సంస్కరణలను అమలు చేసిందన్నారు. సివిల్ సప్లైస్ కార్పొ రేషన్ ద్వారా రైతులు, రైస్ మిల్లర్ల మధ్య సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ నిర్వహిస్తోందని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మార్గదర్శకత్వంలో రాష్ట్ర చరిత్రలోనే అత్యుత్తమ ధాన్యం కొనుగోలు చేపట్టినట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో అధికారులు బాగా పని చేశారని కొని యాడారు. రానున్న సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, కూటమి ప్రభుత్వం రెండో ఏడాదిలో 74 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిందని వివరించారు. రూ.31 వేల కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసి, 11.53 లక్షల మంది రైతులకు 95 శాతం చెల్లింపులు 24 గంటల్లోనే చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో మధ్యాహ్న భోజన పథకానికి నాణ్యమైన బీపీటీ బియ్యం అందిస్తు న్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న 10 శాతం బ్రోకెన్ రైస్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించి దేశవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయిం చిందన్నారు. ప్రతి ధాన్యం బస్తాకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి, ట్రాక్ & ట్రేస్ విధానం ద్వారా రైతు నుంచి ఫెయిర్ ప్రైస్ షాప్ వరకు పూర్తి వివరాలు తెలుసుకునే వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. వాట్సాప్ ద్వారా రైతులు ధాన్యం విక్రయించుకునే సౌకర్యాన్ని కల్పించామని వెల్లడించారు. గన్నీ బ్యాగులు, గోదాములు, రవాణా, తేమ శాతం వంటి అంశాల్లో పారదర్శకత పెంచేందుకు చర్యలు తీసుకున్నామని నాదెండ్ల తెలిపారు. ఖరీఫ్ నుంచి రైతు సేవా కేంద్రాల్లోనే గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచామన్నారు. రవాణా జాప్యాన్ని నివారించేందుకు ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులను కూడా 48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. ఆర్‌ఎఫ్ఐడీ స్టిక్కర్లు, స్కానర్లతో లారీల కదలికలను పర్యవేక్షించే వ్యవస్థ అమలు చేస్తున్నామని చెప్పారు. తేమ కొలిచే మాయిశ్చర్ మీటర్లు అన్ని చోట్లా ఒకే కంపెనీ, ఒకే మోడల్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం 90 శాతం ఏర్పాటు పూర్తవగా, ఖరీఫ్ నాటికి 100 శాతం పూర్తి చేస్తామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ సీజన్‌లో వరి ఉత్పత్తి సుమారు 15 శాతం తగ్గే అవకాశం ఉందని ప్రాథమిక అంచనాలు ఉన్నా యన్నారు. రైతులకు ముందస్తు అవగాహన కల్పించి, అవసర మైన సూచనలు అందించి సమస్యలను అధిగమించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# ఇద్దరు నిందితుల అరెస్ట్



**రేణిగుంట, (రాజధాని వార్తలు):** రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన దోపిడీ కేసును పోలీసులు ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, రేణిగుంట ఎస్డీపీఓ వై.శ్రీనివాసరావు పర్యవేక్షణలో, సీఐ, ఎస్.జయచంద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం నిందితులను అదుపులోకి తీసుకుంది. అరెస్టైన నిందితులు వెంకటగిరి వివేక్ (22), ఆవుల లక్ష్మణ కుమార్ అలియాస్ అఖిల్ (23)గా పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ గతంలో అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన బంగారు గొలుసు దోపిడీ కేసులో జైలుకు వెళ్లి ఇటీవల విడుదలయ్యారని, ఆ కేసులో తమ అరెస్టుకు బాధితుడే కారణమని భావించిన నిందితులు, ఈ నెల 6న రాత్రి బాధితుడిని ఇంటి సమీపానికి పిలిపించి బెదిరించి దాడి చేసి, రూ.1,000 నగదును బలవంతంగా అపహరించినట్లు దర్యాప్తులో వెల్లడైందని, అనంతరం ప్రత్యేక దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇద్దరినీ అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచేందుకు చర్యలు చేపట్టారని, కేసులో ఇతర నిందితుల కోసం గాలింపు కొనసాగుతోందని, ఈ సందర్భంగా ప్రజలు బెదిరింపులు, దోపిడీలు, దాడులు లేదా ఇతర నేరాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని తిరుపతి జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# క్రీడాకారుల కోసం స్పష్టమైన స్పోర్ట్స్ పాలసీ తీసుకొచ్చాం : సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** క్రీడాకారుల కోసం స్పష్టమైన స్పోర్ట్స్ పాలసీ తీసుకొచ్చామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. క్రీడాకారులకు సంపూర్ణ సహకారం అందిస్తా మని పేర్కొన్నారు. స్పోర్ట్స్ పాలసీ తీసుకు రావడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. దేశానికి అకాడమీలు, వసతులు అవసరమని తెలిపారు. గురువారం గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌ను సీఎం ప్రారంభించారు. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ వర్సిటీని ప్రారంభించారు. స్పోర్ట్స్ వర్సిటీ వెబ్‌సైట్, లోగో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఓఏ అధ్యక్షురాలు, ఎంపీ పీటీ ఉష పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిం చారు.

**క్రీడల్లో భారత్ వెనుకబడి ఉంది..**

క్రీడల్లో భారత్ వెనుకబడి ఉందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ క్రీడల పతకాల పట్టికలో..భారత్ అట్టడుగు స్థానంలో ఉంటోందని అన్నారు. క్రీడాకారులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలని సూచించారు. పబ్లిక్ – ప్రైవేట్ భాగస్వామ్యంతో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పుకొచ్చారు. దేశం గర్వించే క్రీడాకారులు, వ్యాపారవేత్తలను భాగస్వామ్యం చేస్తామని తెలిపారు. ఏ రంగంలోనైనా కష్టపడేవారు తప్పకుండా రాణిస్తారని అన్నారు. క్రీడలపై యువత దృష్టి సారించాలని సూచించారు. యువతే ఈ దేశ సంపద అని వ్యాఖ్యానించారు.

**పీటీ ఉష దేశానికి పేరు తెచ్చారు..**

ఒలింపిక్స్‌లో ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత్ అత్యంత వెనుక పడిందని సీఎం తెలిపారు. ప్రభుత్వాలకు ఒక విధానం లేకపోవడమే ఇందుకు కారణమని చెప్పుకొచ్చారు. అప్పుడప్పుడు పీటీ ఉషలాంటి క్రీడాకారులు క్రీడల్లో దేశానికి పేరు తీసుకువచ్చారని ప్రశంసించారు. క్రీడల్లో రాణించడం వల్లే పీటీ ఉషకు గుర్తింపు వచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. క్రీడల్లో రాణించి ఆమె రాజ్యసభ సభ్యురాలి స్థాయికి చేరారని ప్రశంసించారు. ప్రపంచ దేశాల్లో భారత్‌ను క్రీడల్లో రాణించిన దేశంగా గుర్తించడం లేదని అన్నారు. అందుకే తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు ప్రత్యేక పాలసీని తీసుకొచ్చిందని వివరించారు.

**లక్ష్యాన్ని చేరాలంటే వందశాతం కష్టపడాల్సిందే..**

స్పోర్ట్స్ యూనివర్సిటీని పబ్లిక్ ప్రైవేట్ విధానంలో ప్రారంభిం చామని సీఎం వెల్లడించారు. లక్ష్యాన్ని చేరాలంటే వంద శాతం కష్టపడాల్సిందేనని సూచించారు. రాబోయే రోజుల్లో ఒలింపిక్స్‌కు వేదికగా తెలంగాణను తీర్చిదిద్దాలని లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పుకొచ్చారు. క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగాలతో పాటు నగదు పారితోషికం ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 2028 నాటికి తెలంగాణ స్పోర్ట్స్ అకాడమీని ప్రారంభిస్తామని వివరించారు. క్రీడల్లో రాణిస్తే మీ భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. క్రీడల్లో రాణించి దేశానికి పేరు తీసుకు వస్తే మీకు ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# శాటిలైట్ ఫోన్ లాంచ్ చేసిన బీఎస్ఎన్ఎల్.. ధర రూ.1.34 లక్షలు




**ఢిల్లీ:** దేశంలో నెట్‌వర్క్ లేని మారుమూల ప్రాంతాలు, కొండ కోనల్లోనూ నిరంతరాయంగా కమ్యూనికేషన్ అందించేందుకు వీలుగా బీఎస్ఎన్ఎల్ ఓ సరికొత్త శాటిలైట్ ఫోన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. పన్నులతో కలిపి దీని ధరను రూ. 1,34,166గా నిర్ణయించారు. సాధారణ స్మార్ట్‌ఫోన్‌ల వలే కాకుండా, ఇది నేరుగా ఉపగ్రహాల సాయంతో పనిచేస్తుంది. మనం వాడే సాధారణ ఫోన్లు దగ్గరలోని మొబైల్ టవర్ల సిగ్నల్స్ ఆధారంగా పనిచేస్తాయి. కానీ, ఈ శాటిలైట్ ఫోన్ నేరుగా అంతరిక్షంలోని ఉపగ్రహాలతో అనుసంధానమై ఉంటుంది. దీనికోసం బీఎస్ఎన్ఎల్ సంస్థ గ్లోబల్ శాటిలైట్ నెట్‌వర్క్ ప్రొవైడర్ అయిన 'ఇన్మార్శాట్'తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. మొబైల్ కవరేజ్ లేని ప్రాంతాల్లో, అత్యవసర సమయాల్లో వాయిస్ కాల్స్ చేసుకోవడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది.

# విజయవాడలో జనసేన కీలక భేటీ..పార్టీ శ్రేణులకు పవన్ దిశానిర్దేశం



**విజయవాడ, (రాజధాని వార్తలు):** నగరంలో జనసేన పార్టీ కీలక సమా వేశం ప్రారంభమైంది. జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశానికి పార్టీ ఎమ్మె ల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, భవిష్యత్ కార్యాచరణపై ఈ సమా వేశంలో ప్రధానంగా చర్చ జరుగుతోంది. పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని సాగిన 'రావణ్ ఎపిసోడ్'పైనా సమీక్షించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతిపక్షాల విమర్శలకు సమాధానం ఇవ్వడంతో పాటు, పార్టీ శ్రేణులు ప్రజల్లో మరింత చురుగ్గా ఉండేలా కార్యాచరణ రూపొందించనున్నట్లు సమాచారం. మరో వైపు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జనసేనాని భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నాలుగు ప్రాంతాల్లో నిర్వహించనున్న 'జనగళం' కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి నేరుగా సమస్యలు స్వీకరించే కార్యక్రమంపై చర్చ జరగనుంది. ఈ కార్యక్రమాలకు పార్టీకి చెందిన ఒక మంత్రి, నలుగురు ఎమ్మెల్యేలు తప్పనిసరిగా హాజరయ్యేలా ఆదేశాలు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. 'జనగళం'తో పాటు మరికొన్ని ప్రజా కార్యక్రమాల బాధ్యతలనూ పార్టీ నేతలకు అప్పగించే యోచనలో పవన్ ఉన్నట్లు సమాచారం. నియోజకవర్గాల వారీగా పార్టీ కార్యక్రమాలపై పర్యవేక్షణ పెంచాలని దిశానిర్దేశం చేయనున్నారు. అలాగే నియోజకవర్గాలలో సర్ కార్యక్రమాన్నీ పర్యవేక్షించి.. ఓట్లు మిస్ కాకుండా చూసేలా పవన్ సూచనలు చేయనున్నారు. ఇదిలా ఉండగా.. చికిత్స నిమిత్తం పవన్ కల్యాణ్ రేపు(శుక్రవారం) ముంబైకి వెళ్లనున్నారు. శస్త్రచికిత్స అనంతరం సుమారు 30 రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుందని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ కార్యకలాపాలు సజావుగా కొనసాగేందుకు నాయకులకు దిశానిర్దేశం చేస్తున్నట్లు సమాచారం. పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గాల వారీగా కార్యకలాపాల వేగవంతం వంటి అంశాలపై ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

# న్యూజిలాండ్ పర్యటనకు మోదీ.. లక్సన్ కీలక ప్రకటన



**ఇంటర్నెట్ డెస్క్:** భారత ప్రధాని నరేంద్ర మోదీ న్యూజిలాండ్ పర్యటనకు ఒక రోజు ముందే ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ కీలక ప్రకటన చేశారు. భారత్‌తో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి రావడంతో న్యూజిలాండ్ నుంచి భారత్‌కు జరిగే ఎగు మతుల్లో 57 శాతం ఉత్పత్తులకు తొలిరోజే దిగుమతి సుంకం రద్దు చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ ఒప్పందంతో న్యూజిలాండ్ వాణిజ్యదారులకు భారీ ప్రయోజనం చేకూరుతుందని ఆయన స్పష్టం చేశారు. కాగా.. జులై 10న ప్రధాని మోదీ ఆక్లాండ్‌కు చేరుకోనున్నారు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా పర్యటనల అనంతరం ఆయన మూడు దేశాల పర్యటనలో భాగంగా చివరగా న్యూజిలాండ్‌ను సందర్శించనున్నారు. 40 ఏళ్లలో భారత ప్రధాని అధికారికంగా న్యూజిలాండ్‌లో పర్యటించడం ఇదే తొలి సారి. ఈ ఏడాది ఏప్రిల్‌లో భారత్, న్యూజిలాండ్‌లు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ డీల్‌తో ఆ దేశం నుంచి భారత్‌కు వచ్చే 95 శాతం వస్తువులపై సుంకాలను దశలవారీగా తొలగించాలి. దీంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య, పెట్టుబడి సంబంధాలు మరింత బలోపేతమయ్యే అవకాశముంది. 2024–25 ఆర్థిక ఏడాదిలో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 1.3 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరింది. 2024లో ఇది 2.4 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఇందులో ప్రయాణం, సమాచార సాంకేతిక సేవలు, వ్యాపార రంగాలు కీలక పాత్ర పోషించాయి. మోదీ–లక్సన్ సమావేశంలో.. వాణిజ్యం, పెట్టుబడులు, సముద్ర భద్రత, విద్య, సాంకేతికత, పర్యాటకం, క్రీడలు వంటి అంతర్జాతీయ అంశాలు ప్రధానంగా చర్చకు రానున్నాయి. భారత 'యాక్ట్ ఈస్ట్' విధానం, 'మహాసాగర్ (మ్యూచువల్ అండ్ హోలిస్టిక్ అడ్వాన్స్‌మెంట్ ఫర్ సెక్యూరిటీ అక్రాస్ ద రీజియన్స్)' దృష్టికోణం సహా స్వేచ్ఛాయుత ఇండో–పసిఫిక్ ప్రాంత నిర్మాణానికి ఈ పర్యటన మరింత ఉపయుక్తం కానుందని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు.

# విధులకు గైర్హాజరైన 8 మంది హోంగార్డులపై క్రమశిక్షణా చర్య

## - హోంగార్డ్ కమిటీ ప్రత్యేకంగా సమావేశం











**విశాఖపట్నం, కైలాసగిరి (అనకాపల్లి), (రాజధాని వార్తలు):** అనకాపల్లి మరియు అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 8 మంది హోంగార్డులపై క్రమశిక్షణా చర్యలు తీసుకునేందుకు విశాఖపట్నం కైలాసగిరిలోని ఆర్మ్డ్ రిజర్వ్ ప్రధాన కార్యాలయంలో హోంగార్డ్ కమిటీ ప్రత్యేకంగా సమావేశమైంది.

విధులకు నిరంతరం గైర్హాజ రవడం మరియు ఇతర క్రమశిక్షణా రాహిత్య కారణాల వల్ల వీరిపై చర్యలకు ఈ సమావేశం ఏర్పాటు చేశారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ హోంగార్డ్ కమిటీ చైర్మన్ గా జరిగిన ఈ సమావేశంలో హోంగార్డ్ కమిటీ సభ్యులైన విశాఖ రీజియన్ హోమ్ గార్డ్ కమాండెంట్ ఏ.జోషి, హోంగార్డ్ డీఎస్పీ ఏ.రాఘవేంద్రరావులు పాల్గొని నిబంధనల ప్రకారం తీసుకోవా ల్సిన క్రమశిక్షణా చర్యలపై చర్చించారు. ఈ సమావేశంలో ఏ.ఆర్ డీఎస్పీ కె.రవికుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు మన్మధరావు, రమణ మూర్తి, ఆఫీస్ సూపరింటెండెంట్ దేవరాజు, సీసీ ప్రతాప్, కార్యాలయ సిబ్బంది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : రాంబిల్లి ఎస్సై దినకర్




**రాంబిల్లి, (రాజధాని వార్తలు):** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో ఉన్నత భవిష్యత్తును పొందాలని ఎస్సై దినకర్ అన్నారు. బుధవారం రాంబిల్లి మండలం పెద్ద కలవలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల గురించి, కన్న వారి గురించి ఆలోచిస్తూ ఒక ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరుచుకొని దాని సాధనకు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. చెడు అలవాట్లకు లోనై చదువును పక్కన పెట్టి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నప్పుడు మత్తు పదార్థాల జోలికి వెళ్ళరని, వారిని తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు అభినందనీయులన్నారు. మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తూ జీవితాన్ని సర్వనాశనం చేస్తాయని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికి చట్టపరంగా కఠిన శిక్షలు అమలులో ఉన్నాయని, వాటి గురించి విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్వేషాలను సృష్టించడమే జగన్ లక్ష్యం

## - శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ నాయకులు

**శ్రీకాళహస్తి టౌన్, (రాజధాని వార్తలు):** కులాలు, మతాలు మరియు ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టే వ్యక్తులకు గాని, సంస్థలకు గానీ అవసరమైన మేరకు ఇతోధికంగా సహకారం అందించే వైసిపి అధినేత జగన్ రెడ్డి, విద్వేషాలను సృష్టించడమే లక్ష్యంగా రాజకీయ కార్యకలాపాలు నిర్వహిస్తాడని శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ నాయకులు ఆరోపించారు. హిందూ మత విశ్వాసాలను అవహేళన చేస్తూ, హైందవ ధర్మాన్ని పాటించే వ్యక్తులను, హిందూ ధార్మిక సంస్థలను ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడిన బచ్చల కూరి జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్ అనే వ్యక్తికి మద్దతుగా మాట్లాడుతున్న జగన్ రెడ్డి సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మాన్ని, హిందూ దేవతలను లక్ష్యంగా చేసుకొని వివాదాస్పద కంటెంట్ రన్ చేసే యూట్యూబర్ ప్రశ్న రావణ్ పైన దేశద్రోహం, సార్వభౌమాధికారానికి భంగం కలిగించడం వంటి తీవ్రమైన సెక్షన్లతో 'ఉపా' చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటే, ఇంతటి తీవ్రమైన నేరాభియోగం ఎదుర్కొంటున్న వ్యక్తికి మద్దతుగా నిలబడటమే కాకుండా అతనికి న్యాయ సహాయం చేయడం అనైతిక చర్య అని ఆరోపించారు. నాడు పవన్ కళ్యాణ్ ను, అతని భార్యా పిల్లలను బూతు పదజాలంతో దూషించడానికి పోసాని కృష్ణమురళిని ప్రయోగించినట్లే, నేడు ప్రశ్న రావణ్ ద్వారా చంద్రబాబు, పవన్, హిందూ మతాన్ని అవమానకరంగా మాట్లాడించి మతపరమైన విద్వేషాలను సృష్టించడం ద్వారా రాజకీయ అస్థిరత సాధించాలన్నదే జగన్ రెడ్డి యొక్క దుర్మార్గమైన లక్ష్యం అని ఆరోపించారు. గతంలో గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్, వివిధ క్రిమినల్ కేసుల్లో ఇరుక్కున్న వారికి వెనుకేసుకొచ్చిందనే ఆరోపణలు ఎదుర్కొన్న వైకాపా.. ఇప్పుడు ఏకంగా ఉపా చట్టం కింద దేశద్రోహం కేసుల్లో అరెస్టయిన వారికి కూడా న్యాయ సాయం అందిస్తామని ప్రకటించడం



జగన్ రెడ్డి యొక్క కుట్రను బహిర్గతం చేస్తున్నదని తెలిపారు. గతంలో కల్తీ లడ్డూ వ్యవహారంతో కోట్ల మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసి, తీవ్ర ఆత్మరక్షణలో పడిన వైసిపి, తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న రావణ్‌లాంటి వారికి న్యాయ సాయం అందిస్తామని ప్రకటించడం, వైసిపి అరాచక మనస్తత్వాన్ని తెలియజేస్తున్నదని మండిపడ్డారు. ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం ప్రభుత్వ వ్యతిరేక అజెండాను నడిపే వారికి బాసటగా నిలవడానికి జగన్ రెడ్డి అందరికన్నా ముందు ఉంటారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, తంగేళ్ళ పాలెం పిఏసియస్ ఛైర్మన్ బీమాల భాస్కర్ ముదిరాజ్, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, శ్రీకాళహస్తి పట్టణ సహకార బ్యాంకు మాజీ ఛైర్మన్ డి.వి.నారాయణ, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, తిరుపతి పార్లమెంటు నాయకులు గాజుల భగత్, సులేమాన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో ఆలయాలు పునరుద్ధరణకు నిధులు కేటాయించాలి

- పురాతన పంచదార్ల ఉమా ధర్మ లింగేశ్వర స్వామి ఆలయాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి
- పంచదార్లకొండ ప్రాంతంలో గ్రావెల్ తవ్వకాలు జరగకుండా నిరోధించాలి - రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి రామనారాయణ రెడ్డిని కోరిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

**రాంబిల్లి, (రాజధాని వార్తలు):** యలమంచిలి నియోజకవర్గంలో ఆల యాల పునరుద్ధరణకు శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నిదులు కేటాయించాలని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కోరానని యలమంచిలి నియోజకవర్గం ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ తెలిపారు. గురువారం విజయవాడలో ఆయన మంత్రిని కలిసి వినతి పత్రాన్నిచ్చారు. నియోజకవర్గం పరిధిలో పురాతన ఆలయాల పునరుద్ధరణతో పాటు పలు గ్రామాల్లో నూతన ఆలయాలు నిర్మించాల్సి ఉందన్నారు . అలాగే రాంబిల్లి మండలం పంచదార్లలో గల 14వ శతాబ్దానికి చెందిన అతి పురాతనమైన ఉమా దర్మలింగేశ్వర స్వామి ఆలయం పునరుద్ధరణకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరానన్నారు. ఈ ప్రాంతంలో పాండవులు వనవాసం సమయంతో తిరిగినట్లు పురాతన శాశనాలు ద్వారా తెలుస్తోందని ఈశాశనాలు ఇప్పటికీ ఇక్కడ ఉన్నాయని, ధర్మరాజు స్వయంగా ఈ ఆలయాన్నినికి వచ్చినట్లు శాశనాలున్నాయని, అటువంటి చారిత్రక ప్రాశస్త్యం కలిగిన ఆలయ పునర్దురణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని మంత్రికి వివరించానన్నారు. అలాగే ఈఆలయాన్ని ఆనుకొని ఉన్న సువిశాలమైన కొండ ప్రాంతంలో గ్రావెల్ తవ్వకాలను నిరోధించాలని కూడా తాను మంత్రి దృష్టికి తీసుకువెళ్లానని దీనికి ఆయన సానుకూలంగా స్పందిచారని సంబందిత అధికా



రులతో చర్చించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ తెలిపారు.

# రాంబిల్లి మండలంలో ఘనంగా వైఎస్సార్ జయంతి



**రాంబిల్లి, (రాజధాని వార్తలు):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రివర్యులు దివంగత వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను రాంబిల్లి మండల కేంద్రంలో వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు కిషోర్ రాజు ఎంపీపీ శ్రీనుబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైయస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వైసిపి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, జలయజ్ఞం, ఫీజు రీంబర్స్మెంట్ ఇలా ఎన్నో పథకాలతో, బడి పిల్లల నుండి పండు ముసలివారి వరకు సంక్షేమ సారథిగా పేదల ఎదుగుదలకు బాటలు వేసిన మహనీయుడు ఆ దివంగత నేత వై.యస్.రాజశేఖర్ రెడ్డి అని, వారి భౌతికంగా మనకు దూరం ఉన్నా, వారి పథకాల ద్వారా లబ్ది పొందిన ప్రతి ఒక్కరి చిరునవ్వులో ఎప్పటికి కలకాలం నిలిచి ఉంటారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సోషల్ మీడియా ఉపాధ్యక్షుడు చేపల గోవిందు, తాతబాబు, ఎ.ఈశ్వరరావు, పి.చిన్న నాయుడు, కే.గణేష్, ఎం.నర్సింగరావు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమర శంఖం పూరిద్దాం జగనన్నను గెలిపించుకుందాం

**పెళ్లకూరు, (రాజధాని వార్తలు):** మండలంలోని పెళ్లకూరు మిట్ట గ్రామంలో గుడ్ మార్నింగ్ పెళ్లకూరు కార్యక్రమం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి గ్రామంలోని ప్రతి ఇంటికి పోయి ఆప్యాయంగా పలకరిస్తూ ప్రజల కష్ట సుఖాలను తెలుసుకుంటూ గుడ్ మార్నింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. రాబోవు ఎలక్షన్లో పంచాయతీ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి ఒక్క కార్యకర్త జగనన్న సైనికుడిలా కష్టపడి,సమర శంఖం పూరిద్దాం జగనన్నను 2029 ఎలక్షన్లో ముఖ్యమంత్రిగా చేసుకుందాం అని తెలిపారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా నిలబడి పంచాయతీ ఎలక్షన్‌లో 24 పం చాయతీలో వైఎస్ఆర్ కాంగ్రెస్



పార్టీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘు నాయుడు, మోహన్ రెడ్డి, యాగానికి జాకప్ పలువురు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తంగేళ్లపాలెం పిఏసిఎస్ రైతులకు ఊరట

## - వడ్డీ మాఫీ - ఓటీఎస్ పథకం అమలు



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** తొట్టంబేడు మండలం తంగేళ్ల పాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పిఏసిఎస్ కార్యాలయంలో బోర్డు సమావేశం నిర్వహించారు. చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డిసిసిబి ఆదేశాల మేరకు రైతులకు భారీ ఊరట కలిగించే నిర్ణయాలు తీసుకున్నట్లు సంఘం ఛైర్మన్ బీమాల భాస్కర్ ముదిరాజ్, డైరెక్టర్ బత్తయ్య ధనంజయలు, సీఈవో పి.చిరంజీవిరెడ్డి సంయుక్తంగా వెల్లడించారు. మరణించిన రైతుల రుణాలపై పూర్తి వడ్డీ మాఫీ 31-03-2016 కు ముందు రుణం తీసుకుని మరణించిన రుణగ్రహితల రుణాలపై వడ్డీ, వడ్డీపై వడ్డీ, అపరాధ వడ్డీ పూర్తిగా మాఫీ చేయనున్నారు. మరణ ధృవీకరణ పత్రంతో లబ్ధిదారుల కుటుంబ సభ్యులు సంఘాన్ని సంప్రదించాలని సూచించారు. ఓ టిఎస్-వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకం దీర్ఘకాలిక బకాయిలు, ఎన్.పి.ఏగా మారిన ఖాతాల కోసం ఓ టి ఎస్ పథకాన్ని అమలు చేస్తున్నారు. 31-03-2016కు ముందు మంజూరైన, ఎన్.పి.ఏ గా మారిన రుణాలు. దీర్ఘకాలిక రుణాలపై ఐ,ఓడి, పిఐ మాఫీ.ఒక్కో రుణగ్రహితకు గరిష్టంగా రూ.5 లక్షల బకాయిలు వరకు వర్తిస్తుంది. సెటంట్‌కు 6 శాతం ఫ్లాట్ వడ్డీ లేదా గరిష్టంగా 7 శాతం వడ్డీతో లెక్కిస్తారు. 6సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలకు 6 శాతం ఫ్లాట్ వడ్డీ వర్తిస్తుంది. ఓటీఎస్ ప్రతిపాదనలను పరిశీలించేందుకు పిఏసిఎస్ స్థాయిలో డిసిసిబి బ్రాంచ్ మేనేజర్,శాఖ పర్యవేక్షకుడు,పిఏసిఎస్ సిఇఓతో కమిటీ ఏర్పాటు చేశారు. ప్రధాన కార్యాలయం ఆమోదించిన రైతుల జాబితాకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని అధికారులు తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతు సోదరులందరూ సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు తంగేళ్లపాలెం పిఏసిఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలని ఛైర్మన్ బీమాల భాస్కర్ ముదిరాజ్ కోరారు.

# సంపాదకీయం

## ప్రతిపక్షాలకు ప్రజాస్వామ్య పాఠాలు

న్యాయవిరుద్ధంగా జరుగుతోన్న ప్రజాస్వామిక ఎన్నికలను ఎందుకు బహిష్కరించకూడదు? ఈ ప్రశ్న గుసగుసలుగా వినిపిస్తోంది. దీనిపై బహిరంగ చర్చ జరగాలి. ఆ చర్చ 'ఎన్నికలతో ఎందుకు ఇబ్బంది పడాలి?' అన్న ప్రశ్నతో ఆరంభమవ్వాలి. తులనాత్మక రాజకీయాలపై మౌలిక కృషికి ప్రసిద్ధుడైన పోలిష్-అమెరికన్ రాజనీతి శాస్త్రవేత్త ఆడమ్ ప్రెవోర్స్కీ ప్రజాస్వామిక ఎన్నికలను గట్టిగా సమర్థించారు. ప్రజాస్వామ్యానికి ఆయన ఇచ్చిన నిర్వచనం సుప్రసిద్ధమయింది. 'ఎన్నికల ద్వారా ప్రభుత్వాలను ఎన్నుకోవడానికి, తొలగించడానికి వీలుండే ఒక వ్యవస్థ' అని ప్రజాస్వామ్యాన్ని ఆయన నిర్వచించారు. సుపరిపాలన, న్యాయబద్ధమైన ప్రజా ప్రాతినిధ్యం, సామాజిక సామరస్యం ప్రజాస్వామ్యంతోనే సమకూరుతాయని మనం స్వతస్సిద్ధంగా విశ్వసిస్తాం. అయితే పోటీదాయక ఎన్నికలు ఈ గుణాత్మక పరిస్థితులకు దోహదం చేయకపోవచ్చని ప్రెవోర్స్కీ అంటారు. అయినప్పటికీ ఓటర్లను, నాయకులను, రాజకీయ పార్టీలను చికాకుపరిచే, ఇబ్బంది పెట్టే ప్రజాస్వామిక ఎన్నికలు విధిగా జరగాలని, అనేకానేక విభజనలు, అసమానతలతో సతమతమవుతున్న సమాజాలు అంతర్యుద్ధం దురవస్థల పాలవకుండా సామరస్య పూర్వకంగా మనుగడ సాధించేందుకు అవి విశేషంగా తోడ్పడుతాయని ఆయన నొక్కి చెప్పారు. అధికారంలో ఉన్నవారు పదవీ వైభవాన్ని కోల్పోయేందుకు అంగీకరిస్తారు, ఎన్నికలలో ఓడిపోయినవారు పరాజయాన్ని ఆమోదిస్తారు, అధికార మార్పిడి ఎన్నికల ద్వారా శాంతియుతంగా జరగడమే అందుకు కారణమని ప్రెవోర్స్కీ అన్నారు. 1977 చరిత్రాత్మక లోక్‌సభ ఎన్నికలలో సంభవించిన మార్పే అందుకు నిదర్శనం. ఎన్నికల సమగ్రత (ఎలక్టోరల్ ఇంటిగ్రిటీ) ఒక పరిమితికి మించి పతనం కానప్పుడే అధికార బదిలీ శాంతియుతంగా జరిగేందుకు ఆస్కారమున్నది. అయితే ఎన్నికల సమగ్రతను నిష్పాక్షికంగా నిర్ణయించే ప్రమాణాలు ఏమిటి? ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన 11 అంశాలపై పిప్పానోరిస్, రిచర్డ్ ఫ్రాంక్ ఫెర్రాన్ మార్టినెజ్ కోమా అనే రాజనీతి శాస్త్రవేత్తల విశ్లేషణ ఎన్నికల సమగ్రతను నిర్ధారించేందుకు తోడ్పడుతుంది. వాటిలో ఒకటి ప్రచార నిధులు. ఈ అంశం మన ఎన్నికలను ఎంతగా ప్రభావితం చేస్తుందో మరి చెప్పనవసరం లేదు. నిధుల లభ్యత విషయంలో పాలక ప్రతిపక్షాల మధ్య అసమానతలు ఎన్నికల సమగ్రతకు చేటు చేస్తున్నాయి. 2014 అనంతరం మరో మూడు అంశాల తటస్థ ఎన్నికల అధికారులు, పారదర్శక ఎన్నికల నిర్వహణ పద్ధతులు, మీడియా కవరేజ్‌లో మన ఎన్నికల సమగ్రత క్రమంగా ఆమోదయోగ్య స్థాయి నుంచి బాగా దిగజారిపోతోంది. ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ, డీలిమిటేషన్‌తో పాటు ప్రతిపక్షాలను నిలువునా చీల్చివేయడం మొదలైన చర్యలతో మన ఎన్నికల సమగ్రత మరింతగా భ్రష్టమవుతోంది. కోట్లాది వయోజనులకు ఓటు హక్కును నిరాకరించడం, పాలకపక్షం ప్రయోజనాలకు అనుగుణంగా నియోజకవర్గాల సరిహద్దులను మార్చి వేయడం ఎన్నికల సమగ్రతకు ఎలా తోడ్పడుతాయి? భారత ప్రజాస్వామ్య ఎన్నికలు ఒకప్పుడు ఈ పురానవ భూమికి గర్వకారణంగా ఉండేవి. ఇరుగుపొరుగు దేశాలకు అసూయ పుట్టించేవి. సుదూర ప్రజాస్వామిక దేశాలకు అబ్బురం కలిగించేవి. అదంతా పాతకథ. ఇప్పుడు మన ఎన్నికల సమగ్రత కనీస ఆమోదయోగ్య స్థాయి నుంచి బాగా కిందకు జారిపోయింది. నిక్కచ్చిగా చెప్పాలంటే అధికారపక్షం తాను ఎన్నికలలో గెలిచితీరాలనుకుంటే గెలిచి తీరుతుంది. అలా గెలిచేందుకు అవసరమైన పరిస్థితులను సృష్టించుకోగలదు. ఈ కారణంగానే ప్రతిపక్ష నాయకులు మనుగడ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. తుది ఫలితం ముందుగానే నిర్ణయించబడిన ప్రజాస్వామిక పోటీలో వారు పాల్గొని తీరవల్సిందేనా? ఇదొక మంచి ప్రశ్న. ప్రజాస్వామిక పోటీ నుంచి పూర్తిగా ఉపసంహరించుకోవడం, పూర్తిస్థాయిలో ఎన్నికలను బహిష్కరించడం ఆ ప్రశ్నకు సరైన సమాధానం కాదు, కాబోదు. అటువంటి ప్రతిపాదనను మన ప్రతిపక్షాలు తిరస్కరించాలి. అందుకు మూడు సహేతుకమైన కారణాలు ఉన్నాయి. మొదటిది ఒక నైతిక వాదన. పాలకపక్షం మోసపూరితంగా ఫలితాలను తనకు అనుకూలంగా మార్చుకుంటున్నప్పటికీ ప్రతి ఎన్నికలలోనూ పోటీ చేసి తీరాలన్న సరళమైన ప్రజాస్వామిక తర్కంకాదిది. ఎన్నికల ప్రచార నైతికతకు ప్రాధాన్యమిచ్చే వాదన అది. పార్టీల పరస్పర విమర్శలు వాస్తవాల ఆధారంగా ఉండడం, వ్యక్తిగత దూషణలకు పాల్పడకపోవడం, సమాజంలో శాంతి సామరస్యాలను కాపాడడం మొదలైనవి ఎన్నికల ప్రచారంలో విధిగా అనుసరించాల్సిన కనీస నియమాలు. ప్రజాస్వామిక నిబద్ధత ఆ నైతిక పద్ధతులను అనుసరించాల్సిన ఆవశ్యకతను నిర్దేశిస్తుంది. ఎన్నికల ఫలితాలను తారుమారు చేస్తున్నారని ప్రతిపక్షాలు విశ్వసిస్తుంటే ఆ వాస్తవాన్ని ప్రజలూ పూర్తిగా నమ్మేలా చేయడం వాటి విధ్యుక్త ధర్మం. గత సార్వత్రిక ఎన్నికలలోను, ఆ తరువాత వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలోను 'ఓట్ చోరీ' జరిగిందని కాంగ్రెస్ పార్టీ నెత్తీ నోరు కొట్టుకుని ఆందోళన చేస్తోంది. కాంగ్రెస్ వాదనలపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. అంతమాత్రాన సామాన్య ఓటర్లు ఆ 'ఓట్ చోరీ' అభియోగాన్ని ఆమోదిస్తున్నారనే నిర్ణయానికి రావడం తొందరపాటే అవుతుంది. ఎటూ పాలకులకే అనుకూలంగా వ్యవహరించే జన మాధ్యమాల తీరుతెన్నుల మూలంగా ఎన్నికలలో చోటు చేసుకుంటున్న అక్రమాలపై ప్రజల అవగాహన అరకొరగా మాత్రమే ఉంటోంది. ఈ పరిస్థితి నిరుత్సాహం కలిగిస్తున్నప్పటికీ ఓటర్లు స్వయంగా ఎన్నికల్లో నిష్పాక్షికత, పారదర్శకతను డిమాండ్ చేసే పరిణత స్థాయికి ప్రజాభిప్రాయాన్ని నిర్మించడం ప్రతిపక్షాల బాధ్యత. విపక్షాలకు ప్రజాస్వామిక నైతికత నిర్దేశిస్తున్న కర్తవ్యమది.

# ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా డా.నేమాల నియామకం



**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఆల్ ఇండియా స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ ఫెడరేషన్ (న్యూఢిల్లీ) అనుబంధ సంస్థ ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా విశాఖ నగరానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ డా.నేమాల హేమ సుందరరావు నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడ గాంధీనగర్‌లోని యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నియామకపత్రాన్ని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డా.కాకుమాను వెంకట వేణు, ప్రధాన కార్యదర్శి గాదశిశెట్టి శేఖర్ బాబులచే హేమసుందర్ అందుకున్నారు. ఈ సందర్భంగా డా.నేమాల మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతలను అప్పగించిన యూనియన్ రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

# కారి చిన్న మత్స్యకారుడికి వాసుపల్లి రూ.40,000లు ఆర్థిక సాయం

**- మత్స్యకారుడి ప్రాణానికి కేవలం రూ.10 లక్షలు విలువ కడతారా? - జగన్ అధికారంలో ఉంటే కోటి పరిహారం ఇచ్చేవారు - పేద ప్రజలంటే అంతా చులకన చంద్రబాబు? - మా మత్స్యకారుల ఉసురు తగలక తప్పదు - కూటమి ప్రభుత్వం పై మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి ఫైర్**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** సముద్ర తీరంలో గల్లంతయిన 7గురు మత్స్యకారుల్లో ప్రాణాలతో బయటపడిన బోటు డ్రైవర్ కారి చిన్నకి మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ రూ. 40,000 లు సాయం చేశారు. షీలానగర్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతనిని, కుటుంబ సభ్యులను వాసుపల్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. వైద్యులను అడిగి చికిత్స వివరాలను తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అనంతరం వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ ప్రమాదంలో ప్రాణాలతో బయటపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బోటు డ్రైవర్ కారి చిన్నాను అటు కూటమినేతల నుంచి ఇటు ప్రభుత్వ అధికారుల వరకు పరామర్శ హడావిడి తప్ప అతనికి ఎటువంటి ఆర్థిక సహాయం చేసేందుకు ముందుకు రాలేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వం కూడా స్పందించి అతనికి ఆర్థిక సహాయం చేయకుండా తప్పించుకునే ధోరణిలో వ్యవహరిస్తుందని మండిపడ్డారు. అదేవిధంగా బుధవారం నాడు గల్లంతేన మత్స్యకారుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ. 10 లక్షల చొప్పున పరిహారం ఇచ్చిందని అన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.5 లక్షల రూపాయలు ఇవ్వడం జరిగిందన్నారు. ఒక మత్స్యకారుడు ప్రాణానికి రూ.15 లక్షల రూపాయల విలువ కట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత మత్స్యకారుల కుటుంబ సభ్యులకు చెక్కులు పంపిణీ చేసి బయటకు వెళుతున్న మంత్రి కొల్లు రవీంద్రను మత్స్యకారు కుటుంబాలు అడ్డుకున్నారన్నారు. మాకు చెక్కులు వద్దు అంటూ కొందరు మంత్రి వద్దకు దూసుకు వెళ్తుండగా పోలీసులు అడ్డు పడటం కూడా జరిగిందన్నారు. మత్స్యకార మహిళలు సైతం మంత్రి కారుకు అడ్డంగా నిలిచి తమ నిరసన వ్యక్తం చేశారని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటే బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు ఇచ్చేవారని చెప్పారు. కుటుంబ ప్రభుత్వం బాధ్యతగా మత్స్యకార కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు విశాఖ ఫిషింగ్ హార్బర్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో కేవలం బోట్లు కాలిపోతే మొత్తం 49 మంది బాధిత కుటుంబాలకు అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తక్షణమే స్పందించి రూ.7.11 కోట్ల రూపాయలు తక్షణ ఆర్థిక సహాయం చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన సరిగా లేదని ధ్వజమెత్తారు. కేవలం అధికారం కోసం, ఆస్తుల సంపాదన కోసం మాత్రమే అధికారం చేపట్టినట్లు తెలుస్తుందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని పేర్కొన్నారు. ప్రజల తరఫున పోరాటం చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ గనగళ్ల రామరాజు, జిల్లా జనరల్ సెక్రటరీ చోడిపిల్లి శివ, సౌత్ లీగల్ సెల్ ప్రెసిడెంట్ చింతపల్లి లీల కృష్ణ, మైలిపిల్లి ఆనంద్, గనగళ్ల కామేష్ తదితరులు పాల్గొన్నారు.

# 41వ వార్డులో దివంగత నేత వై.యస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలు





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** దివంగత నేత స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి 77వ జన్మదినోత్సవం సందర్భంగా 41వ వార్డులో జిల్లా వైఎస్ఆర్సీపీ మున్సిపల్ విభాగం అధ్యక్షులు 41వ వార్డు మాజీ కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ మరియు 41వ వార్డు వైఎస్ఆర్సీపీ అధ్యక్షులు కోడిగుడ్ల శ్రీధర్ పలు సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వార్డులో ఉన్న 100 మంది వృద్ధులకు నిత్యావసర సరుకులు అందచేశారు. కేక్ కటింగ్ చేసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కోడిగుడ్ల పూర్ణిమ మాట్లాడుతూ దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి సేవలు చిరస్మరణీయం అన్నారు. ఆయన 1467 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్టాలను చూసి నేరుగా తన మనసునుంచి వచ్చిన ప్రతియొక్క సంక్షేమ పథకాలను రూపొందించారు. గల్లి నుంచి ఢిల్లీ దాకా 108 సేవలు, ఆరోగ్యశ్రీ వంటి సేవలను పరిచయం చేసిన తెలుగు సింహం మన రాజన్న అన్నారు. పేదవాడి కష్టాన్ని తన కష్టంగా భావించి ఆంధ్రప్రదేశును జల యజ్ఞం ద్వారా సస్యశామలం చేసి, ఫీజు రీయాంబర్స్మెంట్ ద్వారా పేదోడిని ఉన్నత చదువులు చదివించి, ఉచిత కరెంటు, రుణమా ఫీతో రైతుల ప్రాణాలు కాపాడి, పేదలకు ఇళ్లు, రుణమాఫీ ద్వారా ప్రజల సంక్షేమనికి కృషి చేసిన ప్రజానాయకుడు డా. వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా కోడిగుడ్ల శ్రీధర్ మాట్లా డుతూ దివంగత రాజశేఖర్ రెడ్డి జన్మదినం సందర్భంగా 41వ వార్డులో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రాజ శేఖర్ రెడ్డి బాటలోనే కొనసాగుతూ ఆయన తనయుడు జగన్మో హన్ రెడ్డి సంక్షేమ బావుటా ఎగురవేశారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం మందు అమ్మకాలపై చూపించే ఆసక్తి ప్రజల మీద చూపించలేకపోతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని చెప్పిన హామీలలో ఒక్కటి కూడా నెరవేర్చలేదని, త్వరలోనే ప్రజలు బుద్ధి చెబుతున్నారని అన్నారు. రాజన్న పాలన మరల రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెక్రటరీ వేలంగిని రావు, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెక్రటరీ పాత్రపల్లి సునీల్ కుమార్, 41వ వార్డు మహిళా ప్రెసిడెంట్ అన్నపూర్ణ, బూత్ ప్రెసిడెంట్లు దాలిబాని మధు కుమార్, ఈశ్వరి, దేవి, సీరం ప్రసాద్, అరసాడ మధు, కార్యకర్తలు జాన్, ఆదిలక్ష్మి, మంగ, ఎలీషా, కుమారి,కనక, వెలంగిని, లూర్దు, అరసాడ లక్ష్మీ, దుప్పర్తి అరుణ తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతలకు పరిరక్షణకు పల్లె నిద్రలు : సిఐ




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** గ్రామాల్లో శాంతిభద్రతలను కాపాడేందుకు పల్లె నిద్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సామర్లకోట సిఐ ఎ కృష్ణ భగవాన్ అన్నారు. సామర్లకోట చంద్రంపాలెం గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని సిఐ కృష్ణ భగవాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ నాయకులు, ప్రజలు విచ్చేసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో శాంతి భద్రతలకు సంభందించి ఇబ్బందులపై ప్రజలను ప్రశ్నించి సిఐ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు, నూతన క్రిమినల్ చట్టాలు, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో శాంతి భద్రతల పరిరక్షణకు నాయకులు, ప్రజలు కలసి కృషి చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, స్టేషన్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# చెరువులో గ్రావెల్ త్రవ్వకాలు అడ్డగింత



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం నియోజవర్గంలోని పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామంలోని పెద్దరాజు చెరువులో అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్నారని ఆరోపిస్తూ వైసిపి ఆందోళనకు దిగింది. బుధవారం చెరువు వద్ద ఉన్న వాహనాలను నిలిపివేసి తవ్వకాలు అడ్డుకున్నారు. వైసీపీ ఇంచార్జి దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎలాంటి అనుమతులు లేకుండా చెరువులో గ్రావెల్ తవ్వి టిప్పర్లతో తరలిస్తున్నారని దొరబాబు ఆరోపించారు. ఇంచార్జ్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో నాయకులు పెద్ద ఎత్తున పెద్దరాజు చెరువు వద్దకు చేరుకున్నారు. టిప్పర్లు నిలిపి వేశారు. ఆందోళన చేపట్టారు. ఆర్డిఓ, తహసీల్దార్‌లు వచ్చి సమాధానం చెప్పాలని అంతవరకు కదిలేది లేదని వైసిపి నేతలు భీష్మించారు. దీనితో త్రవ్వకాలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఈ కార్యక్రమంలో వైసీపీ అయ్యారక కార్పొరేషన్ నాయకులు ఆవాల లక్ష్మినారాయణ, గ్రామంలోని నాయకులు పాల్గొన్నారు.

# సాంకేతికత తోడైతే మత్స్య రంగ అభివృద్ధికి కొత్త అవకాశాలు

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలోనే తొలిసారిగా ఏర్పాటు చేసిన పోర్టబుల్ హ్యాచరీ ద్వారా చేప పిల్లల ఉత్పత్తి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హరీంద్ర ప్రసాద్ ప్రారంభించారు. సామర్లకోట మండలం వేట్లపాలెం మత్స్య క్షేత్రంలో రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ (ఎస్ఐఎఫ్టి), కాకినాడ ఆధ్వర్యంలో నిర్వహించిన పోర్టబుల్ హ్యాచరీ నిర్వహణ, పర్యవేక్షణపై ఒకరోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేప పిల్లల ఉత్పత్తి పెంపొందించడం ద్వారా మత్స్య రంగ అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని అన్నారు. శిక్షణ పూర్తి చేసిన మత్స్యశాఖ అధికారులు, సిబ్బందికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్య క్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రియా, మత్స్యశాఖ కమిషనర్ రమాశంకర్ నాయక్, మత్స్యశాఖ అదనపు డైరెక్టర్ మరియు ఎస్ఐఎఫ్టి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అంజలి, జిల్లా మత్స్యశాఖ అధికారి వి కృష్ణా రావు, సీఐఎఫ్ఏ శాస్త్రవేత్త రమేష్ రాథోడ్, ఎంపీడీవో కె హిమమహేశ్వరి, తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర రెడ్డి, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. శిక్షణలో భాగంగా సీఐఎఫ్ఏ శాస్త్రవేత్తలు చేపల ప్రేరేపిత ప్రజనన, నీటి నాణ్యత నిర్వహణ, గుడ్ల నుంచి స్పాన్, ఫ్రై, ఫింగర్‌లింగ్ దశల వరకు చేప పిల్లల పెంపకంపై అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ హరీంద్ర ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రియా, కమిషనర్ రమాశంకర్ నాయక్‌లు చేపలకు హార్మోన్ ఇంజక్షన్ ఇచ్చి హ్యాచరీలో బ్రీడింగ్ ప్రక్రియను ప్రారంభించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు ఆధ్వర్యంలో, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఆర్ నూకరాజు పర్యవేక్షణలో నిర్మించిన ఈ పోర్టబుల్ హ్యాచరీ ద్వారా ఇక నుంచి వేట్లపాలెం మత్స్య క్షేత్రంలో చేప పిల్లల ఉత్పత్తి చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన మత్స్యశాఖ అధికారులు, అభివృద్ధి అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**సర్ ప్రక్రియ గడువులోగా పూర్తి చేయండి :**

సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామం పంచాయతీలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్లు నమోదు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలిం చారు. 60 శాతం ఉన్న బిఎల్వోలు పనితీరు మెరుగుపరుచుకుని వేగవంతంగా పూర్తి చేయాలని, పదో తేదీ నాటికి నూరు శాతం చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ కొవ్వూరి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీవో కే హిమామహేశ్వరి, డిప్యూటీ ఎంపీడీవో మల్లాడి భైరవ మూర్తి, బిఎల్వోలు పాల్గొన్నారు.

# కియారా అద్వానీ అందాల సందడి.. టాక్సిక్ హైట్ పీక్స్!



కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'టాక్సిక్'. వచ్చే నెల 26న విడుదల కాబోతున్న ఈ సినిమా నుంచి మేకర్స్ ప్రమోషన్స్ స్పీడ్ పెంచారు. తాజాగా యష్, కియారా అద్వాణీలపై చిత్రీకరించిన ఒక రొమాంటిక్ వీడియో సాంగ్‌ను రిలీజ్ చేశారు. ఈ పాటలో వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ అదిరిపోయింది. కియారా ఈ సాంగ్‌లోని కొన్ని బ్యూటిఫుల్ పిక్స్‌ను తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయగా, అవి ఇప్పుడు నెట్టింట సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి.

**ఇన్‌స్టాలో కియారా క్రేజీ క్యాప్షన్:**

ఈ రొమాంటిక్ సాంగ్ పిక్స్‌ను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ కియారా అద్వానీ పెట్టిన క్యాప్షన్ అందరినీ ఆకట్టుకుంటోంది. "నేను వెళ్లే ప్రతిచోటా కొంచెం అలజడిని సృష్టిస్తూ ఉంటాను" అంటూ క్రేజీగా రాసుకొచ్చింది. ఇక ఈ ఫొటోల్లో కియారా తన స్క్రీన్ ప్రెజెన్స్, గ్లామర్‌తో ప్రతి ఫ్రేమ్‌ను మరింత అందంగా మార్చేసింది.

**అదిరిపోయిన కొత్త జోడీ కెమిస్ట్రీ:**

ఇప్పుడు విడుదలైన వీడియో సాంగ్‌లో ప్రేమలో మునిగిపోయిన యశ్, కియారాలను దర్శకురాలు గీతూ మోహన్ దాస్ ఎంతో రొమాంటిక్‌గా చూపించారు. ఈ పాటలో వీరిద్దరి మధ్య కనిపించే ఐ కాంటాక్ట్, లవ్ మూమెంట్స్ అప్పుడే సోషల్ మీడియాలో విపరీతంగా షేర్ అవుతున్నాయి. ఇక తెరపై ఈ సరికొత్త జోడీ సూపర్ కెమిస్ట్రీని పండించిందని, థియేటర్లలో వీళ్ల రొమాన్స్ ఒక రేంజ్‌లో ఉండబోతోందని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

**యష్ సరికొత్త లుక్.. పిల్లలకు నో ఎంట్రీ?:**

ఈ సాంగ్ కాస్త 'బోల్డ్'గా, పెద్దలకు మాత్రమే, పిల్లలు చూసేలా లేదు అన్నట్లుగా ఉండటం విశేషం. ఎందుకంటే ఇందులో యష్ కియారాల మధ్య అదిరిపోయే రొమాన్స్ తప్ప వేరే ఏమీ చూపించలేదు అన్నది కొందరి మాట.

**నదియా పాత్రలో కియారా:**

'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనే ఈ యాక్షన్ థ్రిల్లర్ మూవీలో కియారా అద్వాణీ 'నాడియా' అనే కీలక పాత్రలో నటిస్తోంది. ఇటీవల 'గేమ్ ఛేంజర్', 'వార్ 2' వంటి భారీ చిత్రాలతో మెప్పించిన కియారాకు.. ఈ పాన్–ఇండియా చిత్రం మరో బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ కానుంది. ఇక ఈ సినిమాలో నయనతార, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషీ, తారా సుతారియాలాంటి భారీ తారాగణం కూడా ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో, ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత వస్తున్న 'టాక్సిక్' సినిమాపై ఇప్పటికే అంచనాలు ఆకాశంలో ఉన్నాయి.

ఇప్పుడు వచ్చిన ఈ రొమాంటిక్ సాంగ్ మూవీపై మరింత హైప్ క్రియేట్ చేసింది. కియారా షేర్ చేసిన ఈ హాట్ అండ్ క్లాసిక్ పిక్స్ చూస్తుంటే.. వచ్చే నెల థియేటర్లలో యష్‌తో కలిసి ఈ భామ బాక్సాఫీస్ వద్ద గట్టిగానే అలజడి సృష్టించేలా కనిపిస్తోంది.

# ముందే నిజం చెప్పేసిన పాయల్ రాజ్‌పుత్.. ఫ్యాన్స్‌కు క్లియర్ మెసేజ్!



ఈ మధ్యకాలంలో హీరోయిన్లు ఇన్‌స్టాగ్రామ్‌లో 'సబ్‌స్క్రిప్షన్' ఫీచర్ ద్వారా డబ్బులు సంపాదించడం పెద్ద హాట్ టాపిక్‌గా మారింది. యాంకర్ విష్ణుప్రియ వివాదం తర్వాత, ఈ సబ్‌స్క్రిప్షన్ కంటెంట్‌పై అందరిలోనూ ఆసక్తి పెరిగింది. ఈ నేపథ్యంలో 'ఆర్ఎక్స్ 100' బ్యూటీ పాయల్ రాజ్‌పుత్ కూడా తన ఇన్‌స్టా సబ్‌స్క్రిప్షన్ ఛానెల్ గురించి ఫ్యాన్స్‌కు ముందే ఒక క్లియర్ మెసేజ్ ఇచ్చేసింది. హాట్ పిక్స్ ఆశిస్తే మాత్రం దండం పెట్టేసి, తన ఛానెల్‌లో ఏం చూపిస్తుందో స్పష్టంగా చెప్పేసింది. ఆ వివరాలు చూద్దాం..

**ఇన్‌స్టా సబ్‌స్క్రిప్షన్ రచ్చ:**

కొన్నిరోజుల క్రితం యాంకర్ విష్ణుప్రియ తన ఇన్‌స్టాగ్రామ్ సబ్‌స్క్రిప్షన్ వల్ల తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. డబ్బులు తీసుకుని మరీ అసభ్యకరమైన కంటెంట్ పెడుతోందంటూ కొందరు పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఇక ఆ తర్వాత అనన్య నాగళ్లలాంటి హీరోయిన్లు తమ అకౌంట్లలో ఎలాంటి కంటెంట్ పెడతారో క్లారిటీ ఇచ్చారు. ఇప్పుడు అదే బాటలో పాయల్ రాజ్‌పుత్ కూడా ముందే జాగ్రత్తపడి తన ఫ్యాన్స్‌కు క్లారిటీ ఇచ్చేసింది.

**హాట్ పిక్స్ ఆశిస్తే రాకండి:**

పాయల్ రాజ్‌పుత్ తన ఇన్‌స్టాలో ఒక స్పెషల్ నోట్ పోస్ట్ చేస్తూ.. "నా సబ్‌స్క్రైబర్ ఛానెల్‌లో నేను ఎలాంటి విషయాలు పెడతానని చాలా మంది మెసేజ్‌లు చేస్తున్నారు. ఒక విషయం ముందే స్పష్టంగా చెబుతున్నా. ఒకవేళ మీరు అసభ్యకరమైన కంటెంట్ లేదా 'హాట్ పిక్స్' ఆశిస్తూ ఇందులో చేరాలనుకుంటే, ఈ ఛానెల్ మీకు అస్సలు సెట్ అవ్వదు" అంటూ ముక్కుసూటిగా చెప్పేసింది.

**కేవలం నా నిజమైన వ్యక్తిత్వం మాత్రమే:**

అయితే ఈ ఛానెల్‌లో ఏం ఉంటుందో కూడా పాయల్ క్లియర్ చేసింది. "నా సినిమా షూటింగ్స్ వెనుక ఏం జరుగుతుంది? నా నిజమైన, సహజమైన వ్యక్తిత్వం ఎలా ఉంటుంది? అనేది చూడాలనుకునే వారు మాత్రం హ్యాపీగా ఇందులో జాయిన్ అవ్వచ్చు. నా పరిమితులను అర్థం చేసుకుని, నన్ను గౌరవిస్తున్నందుకు అందరికీ థాంక్స్" అని రాసుకొచ్చింది. అలాగే తన ఇన్‌స్టా క్యాప్షన్‌లో.. "ఈ స్పేస్ కేవలం నా రియల్, అన్‌ఫిల్టర్డ్ లైఫ్ కోసం మాత్రమే.. అంతకుమించి ఏమీ ఉండదు" అని తేల్చేసింది.

**'ఆర్ఎక్స్ 100' తో భారీ క్రేజ్:**


టాలీవుడ్‌లో 'ఆర్ఎక్స్ 100' సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చి కుర్రకారు గుండెల్లో మంటలు రేపింది పాయల్ రాజ్‌పుత్. మొదటి సినిమాతోనే బోల్డ్ బ్యూటీగా భారీ క్రేజ్ సొంతం చేసుకుంది. ఇక ఆ తర్వాత వెంకీమామ, ఆర్డీఎక్స్ లవ్, డిస్కో రాజా, జిన్నా, మాయపేటిక వంటి చిత్రాల్లో నటించింది. ముఖ్యంగా 'మంగళవారం' సినిమాలో తన యాక్టింగ్‌తో అందరినీ మెప్పించింది. చేతిలో కొత్త ప్రాజెక్టులు: గ్లామర్ రోల్స్ మాత్రమే కాదు, నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలు కూడా చేయగలనని పాయల్ నిరూపించుకుంది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ టాలీవుడ్‌లో 'కిరాతక' అనే ఆసక్తికరమైన చిత్రంలో నటిస్తోంది. ఇక మరికొన్ని కొత్త ప్రాజెక్టులపై కూడా చర్చలు జరుపుతోంది. డబ్బుల కోసం కంటెంట్ మార్చకుండా, ముందే తన రూల్స్ ఏంటో చెప్పేసి పాయల్ రాజ్‌పుత్ మంచి పని చేసిందని నెటిజన్లు మెచ్చుకుంటున్నారు. ఇక అనవసరమైన అంచనాలతో సబ్‌స్క్రైబ్ చేసుకుని ఆ తర్వాత విమర్శించే కంటే, ఇలా ముందే నిజం చెప్పేసి పాయల్ అందరి కంటే ఒక అడుగు ముందే నిలిచింది.

# రాంగోపాల్ వర్మని దెయ్యాలు భయపెట్టిన వేళ!



హారర్ చిత్రాలకు కొత్త నిర్వచనం చెప్పిన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ. ముఖ్యంగా భూత్ సినిమాతో ప్రేక్షకులకు కలలో కూడా భయం కలిగించే అనుభూతిని అందించారు. అయితే ఆ సినిమా షూటింగ్ సమయంలో స్వయంగా వర్మకే ఓ వింత అనుభవం ఎదురైందని.. దాన్ని ఆయన ఇప్పటికీ ఓ మిస్టరీగా భావిస్తుంటారని తెలిసింది. ఆ రాత్రి జరిగిన సంఘటన వర్మ జీవితంలో మర్చిపోలేని జ్ఞాపకంగా మిగిలిపోయింది. షూటింగ్ పనులన్నీ ముగించుకుని అర్ధరాత్రి దాటిన తర్వాత 2 గంటల సమయంలో వర్మ తన గదికి చేరుకున్నారు. అలసిపోయి ఉన్నా నిద్రపోయే ముందు ఫ్రెష్ అప్ అయ్యి మంచం మీద సేదతీరడానికి సిద్ధమయ్యారు. అప్పుడే ఆయనకు వింతగా అనిపించింది. ఏదో ఒక అస్పష్టమైన స్వరంతో తన పేరును ఎవరో? పిలుస్తున్నట్లు అనిపించింది. తనను గదిలో ఉన్న వ్యక్తి పిలిచినట్లు స్పష్టంగా వినిపించింది. గదిలో ఉన్న నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వస్తోన్న ఆ పిలుపుతో వర్మ ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. ఎవరైనా? తనను ఉద్దేశించి పిలుస్తున్నారేమోనని? గది అంతా చూసారు. ఆ సమయంలో గదిలో తాను తప్ప మరెవరూ లేరని వర్మకు తెలుసు. పిలిచిన వారికి సమాధానం ఇచ్చేందుకు వర్మ తలుపుల వైపు, గది మూలల వైపు వెతికినా ఫలితం లేకపోయింది. అక్కడ గాలి తప్ప మరొకటి ఉన్న ఆనవాళ్లు కనిపించలేదు. అంతేకాదు వర్మ కూడా తన వంతుగా పిలిచిన వారికి తిరిగి సమాధానం ఇచ్చే ప్రయత్నం చేశారు. ఎవరు? అని గట్టిగా వర్మ అడిగినా? ఆ గదిలో మళ్ళీ అదే నిశ్శబ్దం రాజ్యమేలింది. తనను పిలిచిన వ్యక్తిగానీ, లేదా మరొక శబ్దమా అనేది అర్థం కాక వర్మ అయోమయానికి గురయ్యారు. ఒకవైపు భయం, మరోవైపు ఆశ్చర్యంతో ఆ రాత్రి నిద్ర పట్టక వర్మ ఇబ్బంది పడ్డారు. ఈ సంఘటన వర్మ ఓ ఇంటర్వ్యూలో గుర్తు చేసుకున్నారు. అప్పట్లో భూత్ సినిమా కోసం వర్మ ఎంతో లోతైన పరిశోధన చేసి భయం అంటే ఎలా ఉంటుందో తెరపై చూపించారు. కానీ తనకు ఎదురైన ఆ వింత అనుభవం మాత్రం ఏ సైన్స్ లేదా తర్కానికి అందని చిక్కుముడిగానే ఉండిపోయింది. సినిమా షూటింగ్ చేసేటప్పుడు దెయ్యాల మీద చేసిన ప్రయోగాలు, తనకే ఎదురవ్వడం విచిత్రమైన అనుకోని పరిణామం. ఇలాంటి సంఘటనలు మనిషికి అంతుచిక్కని ప్రశ్నలుగానే మిగిలిపోతాయి. వర్మ వంటి హేతువాది, దర్శకుడు సైతం ఆ రాత్రి తనను పిలిచిన ఆ స్వరం గురించి ఇప్పటికీ వివరణ ఇవ్వలేకపోతున్నారు. ఇది భ్రమా? లేక? మరొకటా అనేది ఎవరికీ తెలియదు. కానీ ఆ రాత్రి జరిగిన సంఘటన మాత్రం ఇప్పటికీ వర్మ భయానక అనుభవాల్లో ఒకటిగా నిలిచిపోయింది.

# రజనీ లాస్ట్ మూవీ అదేనా? లేక సర్ప్రైజ్ చేస్తారా?



ఇండియన్ ఫిల్మ్ హిస్టరీలో తనకంటూ స్పెషల్ చాప్టర్ రాసుకున్న సూపర్ స్టార్ రజనీకాంత్ కెరీర్ లాస్ట్ స్టేజ్‌కు చేరుకుందా? అంటే ప్రస్తుతం కోలీవుడ్‌లో వినిపిస్తున్న చర్చలు చూస్తే అవుననే వినిపిస్తోంది. ఒకవైపు జైలర్ 2 రిలీజ్‌కు రెడీ చేయగా.. ఇప్పుడు ధర్మన్ మూవీతో బిజీగా ఉన్నారు. అయితే అదే ఆయన చివరి సినిమా కావచ్చన్న ప్రచారం ఫ్యాన్స్‌లో ఆసక్తితో పాటు ఆందోళనను కూడా కలిగిస్తోంది. సాధారణ బస్ కండక్టర్‌గా లైఫ్ స్టార్ట్ చేసిన రజనీ.. ఎలాంటి సినీ బ్యాక్ గ్రౌండ్ లేకుండా హార్డ్ వర్క్‌తో భారతీయ సినీ పరిశ్రమలో సూపర్ స్టార్‌గా ఎదిగారు. 50 ఏళ్లుగా ప్రేక్షకులను అలరిస్తూ వస్తున్న ఆయన ప్రస్తుతం 74 ఏళ్ల వయసులోనూ అదే జోష్‌తో సినిమాలు చేస్తున్నారు. ఇప్పటికీ ఆయన కాల్షీట్ల కోసం ప్రముఖ నిర్మాణ సంస్థలు పోటీ పడుతుండటం ఆయన క్రేజ్‌కు బెస్ట్ ఎగ్జాంపుల్. అయితే వయసు పెరుగుతున్న నేపథ్యంలో ఇక సినిమాలకు గుడ్ బై చెప్పాలనే ఆలోచనలో రజనీకాంత్ ఉన్నారని తమిళ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కొంతకాలం తర్వాత పూర్తిగా రెస్ట్ తీసుకోవాలని ఆయన భావిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై రజనీకాంత్ నుంచి కానీ, ఆయన టీమ్ నుంచి కానీ ఇప్పటివరకు ఎలాంటి అఫిషియల్ అనౌన్స్మెంట్ రాలేదు. ప్రస్తుతం రజనీకాంత్.. జైలర్ 2 మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఆ చిత్రానికి నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తుండగా, అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. తొలి భాగం భారీ విజయాన్ని అందుకోవడంతో సీక్వెల్ పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆ చిత్రాన్ని ఆగస్టులో విడుదల చేయాలని మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, రజనీకాంత్ 173వ చిత్రానికి ధర్మన్ అనే టైటిల్‌ను రీసెంట్‌గా ప్రకటించారు. కమల్ హాసన్‌కు చెందిన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ ఆ చిత్రాన్ని నిర్మిస్తోంది. అశ్వత్ మరిముత్తు దర్శకత్వం వహించనున్నారు. విడుదల చేసిన టైటిల్ పోస్టర్‌లో ఆపరేషన్ థియేటర్‌లో సర్జికల్ బ్లేడ్ చేతిలో పట్టుకుని రజనీకాంత్ కనిపించడం విశేషం. దీంతో సినిమాలో ఆయన డాక్టర్ పాత్రలో నటించనున్నారనే ప్రచారం మరింత బలపడింది. అయితే ధర్మన్ నిజంగానే రజనీకాంత్ చివరి సినిమా అవుతుందా? లేక గతంలోలాగే రిటైర్మెంట్ వార్తలకు చెక్ పెట్టి మరోసారి కొత్త ప్రాజెక్టుతో అభిమానులను ఆశ్చర్యపరుస్తారా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. గతంలో కూడా పలుమార్లు ఆయన రిటైర్మెంట్ పై ప్రచారం జరిగినప్పటికీ, ప్రతిసారి కొత్త సినిమాతో అభిమానులను సర్ప్రైజ్ చేశారు. ఈసారి కూడా అదే జరుగుతుందా? లేక నిజంగానే సూపర్ స్టార్ తన జర్నీకి ముగింపు పలుకుతారా? అన్న ప్రశ్నకు సమాధానం రావాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

# చినకాద గ్రామంలో రైతులకు పశుదాణా పంపిణీ

**- పంపిణీ చేసిన మండల టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ శిరువూరి నారాయణమూర్తి రాజు**







**దత్తిరాజేరు, (గజపతినగరం), (రాజధాని వార్తలు):** మండలంలోని చినకాద గ్రామంలో పాడి రైతులకు సబ్సిడీపై ప్రభుత్వం అందజేస్తున్న పశువుల దాణాను తెలుగుదేశం పార్టీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ నారాయణ మూర్తి రాజు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్గనైజింగ్ సెక్రటరీ "శిరువూరి" మాట్లాడుతూ 50 శాతం సబ్సిడీపై పశువుల దాణా ప్రభుత్వం పాడి రైతులకు అందించడం ద్వారా ఈ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వం అని నిరూపించుకుందని నారాయణ మూర్తి రాజు అన్నారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పాడి సంపద ఆరోగ్యకరంగా ఉండేలా చూసుకోవాలని తెలుగుదేశం పార్టీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ శిరువూరి నారాయణ మూర్తి రాజు రైతులను కోరారు. దాణా పంపిణీ కార్యక్రమంలో గ్రామ టిడిపి పార్టీ అధ్యక్షుడు బైరెడ్డి గణేష్, మాజీ వైస్ ప్రెసిడెంట్ ధూళి సూర్యారావు, బీసీ సెల్ అధ్యక్షులు పళ్ళ రమేష్, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# రైతు సేవా కేంద్రాల్లో ఎరువుల పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి

**- ఏపీ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్మెంట్ సిస్టం పోర్టల్ ద్వారా ఎరువుల పంపిణీని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి**







**విజయనగరం, (రాజధాని వార్తలు):** రాజాం మండలం బొద్దాం గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏపీ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్మెంట్ సిస్టం (ఏ పి ఏ ఐ ఎం ఎస్) పోర్టల్‌ను పరిశీలించి రైతులకు ఎరువులను పంపిణీ చేస్తున్న విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. పోర్టల్‌లో నమోదవుతున్న వివరాలు, అందుబాటులో ఉన్న ఎరువుల నిల్వలు, పంపిణీ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా, వేగవంతంగా ఎరువులను పంపిణీ చేయాలని ఆదేశించారు. అనంతరం పోర్టల్ ద్వారా రైతులకు ఎరువులను పంపిణీ చేసారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ, రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని, పోర్టల్‌లో నమోదయ్యే వివరాలను ఎప్పటి కప్పుడు నవీకరించాలని సూచించారు. రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన విధానాలకు అనుగుణంగా నాణ్యమైన ఎరువులను అందించి, ఎలాంటి ఫిర్యాదులకు తావులేకుండా వ్యవహరిం చాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రాజశేఖర్, ఎంపీడీవో ఆనందరావు, వ్యవసాయ అధికారి రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

# చినకాద గ్రామంలో పాస్ పుస్తకాల పంపిణీ

**- పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన టిడిపి మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ శిరువూరి నారాయణమూర్తి రాజు**





**దత్తిరాజేరు, (గజపతినగరం), (రాజధాని వార్తలు):** రాష్ట్ర ఎంఎస్ఎమ్ ఈ, సర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మాత్యులు కొండపల్లి శ్రీనివాస్ ఆదేశాల మేరకు మండలంలోని చినకాద గ్రామంలో బుధవారం రీ సర్వే పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం చేపట్టి నట్లు తెలుగుదేశం పార్టీ దత్తిరాజేరు మండలం ఆర్గనైజింగ్ సెక్రటరీ శిరువూరి నారాయణమూర్తి రాజు విలేకరులకు తెలి యజేశారు. ఈ సందర్భంగా ఆర్గనైజింగ్ సెక్రటరీ "శిరువూరి" మాట్లాడుతూ చినకాద గ్రామపంచాయతీ పరిధిలో గల విజయరామ గజపతి రాజపురం రెవెన్యూ గ్రామ రీ - సర్వే పాస్ పుస్తకాలను పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. రీ - సర్వే జరిగి తాము సాగు చేస్తున్న భూమి యొక్క విస్తీర్ణాన్ని పాస్ పుస్తకాల ద్వారా పొందిన రైతులు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో దత్తిరా జేరు మండల తాసిల్దార్ హరి కిరణ్, రీ - సర్వే డిప్యూటీ తాసిల్దార్, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహానేత వైయస్సార్ జయంతి వేడుకలు

**- జలయజ్ఞంతో పంట పొలాలను సస్యశ్యామలం చేసిన అపర భగీరధుడు వైయస్సార్ - రైతన్నల మోములో ఆనందం చూడడానికి ఉచిత విద్యుత్‌పై మొదటి సంతకం చేసిన వైయస్సార్ : యువనేత బొత్స సాయి గురునాయుడు**









**బొండపల్లి, గంట్యాడ, (గజపతినగరం), (రాజధాని వార్తలు):** నియోజకవర్గ పరిధిలోగల బొండపల్లి, గంట్యాడ మండలాలలో మహానేత, దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి 77వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ జయంతి వేడుకలలో వైకాపా యువనేత బొత్స సాయి గురునాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువనేత సాయి గురునాయుడు గంట్యాడ మండలం కోటారుబిల్లి జంక్షన్, బొండపల్లి మండలం బొండపల్లి గ్రామంలో గల వైయస్సార్ విగ్రహాలకు పాలాభిషేకం చేసి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా యువ నేత బొత్స సాయి గురునాయుడు మాట్లాడుతూ రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సుమారుగా రెండు లక్షల శస్త్ర చికిత్సలు చేయించిన జనహృదయ విజేత వైయస్సార్ అని అన్నారు. విద్యా రంగంలో ఫీజు రీయింబర్స్మెంట్ ద్వారా లక్షల మంది విద్యార్థులకు ఉన్నత చదువులు చదివించి బంగారు భవిష్యత్తును అందించిన మహానేత వైయస్సార్ అని సాయి గురునాయుడు కొనియాడారు. జలయజ్ఞంతో రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని సస్యశ్యామలం చేసిన అపర భగీరధుడు వైయస్సార్ అని ఆయన వైయస్సార్ సేవలను జ్ఞప్తికి తెచ్చారు. రైతన్నల మోములో ఆనందం చూడడానికి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ఉచిత విద్యుత్ పై మొదటి సంతకం చేసిన మహానేత వైయస్సార్ అని బొత్స సాయి గురునాయుడు పార్టీ శ్రేణులకు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు బి.వి.ప్రభుజీ, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల చిన్నమనాయుడు, మాజీ ఎంపీపీ బండారు బంగారమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు మూకల చలం నాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, రమణ, మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా వైయస్సార్ జయంతి వేడుకలు

**- ఆరోగ్యశ్రీ ప్రధాత వై.ఎస్.ఆర్ - ఎంతోమందికి ఆరోగ్యశ్రీ ద్వారా గుండె ఆపరేషన్లు చేయించి జనహృదయాల్లో తనదైన చెరగని ముద్ర వేసుకున్న మహానేత వైయస్సార్ : మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య**



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** జనహృదయ విజేత, దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్. రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలు బుధవారం నియోజకవర్గ కేంద్రమైన గజపతినగరంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ ప్రధాత అని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కొనియాడారు. అదే విధంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఎంతోమందికి ఉచితంగా గుండె సంబంధిత ఆపరేషన్లు చేయించి జన హృదయాల్లో తనదైన చెరగని ముద్ర వేసుకున్న మహానేత వైయస్సార్ అని అన్నారు. నిరుపేదలకు పక్కా ఇల్లు కట్టించి ఇవ్వడానికి భారీ సబ్సిడీలతో ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభించిన మహానేత వైయస్సార్ అని బొత్స అన్నారు. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త బొత్స అప్పలనరసయ్య ముందుగా వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వైయస్సార్ విగ్రహానికి కూడా పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో మండల నాయకులు మండల సురేష్, జడ్పిటిసి గార తౌడు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ కో - ఆర్డినేటర్ బూడి వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షులు పల్లి సంజీవరావు, యువజన విభాగం నియోజకవర్గ కన్వీనర్ కె.పైడిపినాయుడు, మాజీ ఎంపీపీ కంది తిరుపతి నాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు నారాయణ మూర్తి రాజు, బెల్లాన త్రినాధరావు, గేదెల జగదీష్, గేదెల ఈశ్వరరావు, ఇజ్జురోతు పైడిపినాయుడు, కర్రీ రామునాయుడు, గురుగుబిల్లి సత్యనారాయణ, లోగీస శ్రీను, గేదెల సన్యాసిరావు, తిరుపతిరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మూడురోజుల్లో విత్తన పంపిణీ పూర్తి చేయాలి

## - ముందుగానే ఎరువులను అందజేయండి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి - మిషన్ హార్టీ విజన్‌పై సమీక్ష





**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఈనెల 11 లోగా విత్తనాల పంపిణీని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. జిల్లాలోని వ్యవసాయ పరిస్థితులు, మిషన్ హార్టీ విజన్ అమలుపై కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్షేత్రస్థాయి అధికారులతో బుధవారం సమీక్షించారు. రైతులందరికీ శనివారం నాటికి సజావుగా విత్తన పంపిణీ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే సాగుకు సిద్దమవుతున్న రైతులకు ముందుగానే కావాల్సిన ఎరువులను ఎపిఏఐఎంఎస్ యాప్ ద్వారా పంపిణీ చేయాలని చెప్పారు. దీనివల్ల ముమ్మర సమయంలో రద్దీని తగ్గించవచ్చునని సూచించారు. అవసరమైన ఎరువులు ఇప్పటికే రైతు సేవా కేంద్రాల్లో ఉన్నాయని తెలిపారు. కావాల్సిన మోతాదు, దఫాలను లెక్కించి ఎరువులను అందించాలని తెలిపారు. అలాగే అర్హత ఉన్న రైతులందరికీ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా వారి పంటలకు రక్షణ కల్పించాలని సూచించారు. ప్రత్తి పంటకు జులై 15, మొక్కజొన్న, నువ్వు పంటలకు జులై 31, వరికి ఆగస్టు 31 వరకు బీమా పొందేందుకు గడువు ఉందని, దీనిపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. మిషన్ హార్టి విజన్ ద్వారా ఖరీఫ్‌లో 6,000 ఎకరాలను ఉద్యాన పంటలవైపు మళ్లించాలన్నది లక్ష్యం కాగా, దానిని సాధించేందుకు కృషి చేయాలని కలెక్టర్ చెప్పారు. దీనిపై సమీక్షిస్తూ ఇప్పటికే పలుచోట్ల బోర్లు తవ్వడం జరిగిందని, వాటికి వెంటనే విద్యుత్ కనక్షన్లు మంజూరు చేయాలని ఆదేశించారు. అలాగే నీటి సదుపాయం, విద్యుత్ ఉన్న రైతులకు ఏపిఎంఐపి ద్వారా 90 శాతం రాయితీపై అర్హత ఉన్నవారందరికీ డ్రిప్ లేదా స్పింక్లర్ల సదుపాయాన్ని కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ జె.డి వి.టి రామారావు, ఉద్యానశాఖ డిడి చిట్టిబాబు, ఏపిఎంఐపి పిడి పిఎన్‌వి లక్ష్మీనారాయణ, ట్రాన్స్‌కో ఎస్ఈ లక్ష్మణరావు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ వెంకటేశ్వర్రావు, ఏపిసీడ్స్ డిఎం పద్మ, ఆన్‌లైన్ ద్వారా ఏడిఏలు, ఎంఏఓలు, హెచ్ఓలు, ఏఈఒలు పాల్గొన్నారు.

# నా ఇంటి అక్రమ రిజిస్ట్రేషన్‌పై న్యాయం చేయాలి

## - అధికారులకు అర్జీలిస్తున్నా ఫలితం లేదు : బాధితుడి ఆవేదన




**నెల్లూరు టౌన్, (రాజధాని వార్తలు):** తన ఇంటిని, స్థలాన్ని ఓ వ్యక్తి కబ్జా చేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడంపై ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని బుచ్చిరెడ్డిపాలెం మండలం నాగమాం బాపురానికి చెందిన కొండా వంశీ వేడుకున్నారు. నెల్లూరులోని ప్రెస్ క్లబ్లో బుధవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కుటుంబ సభ్యులతో కలసి ఆయన తన గోడును వెళ్లబోసుకున్నారు. తన తండ్రి వెంకయ్య 15 ఏళ్ల క్రితం సూరిపోగు మస్తానమ్మ దగ్గర మూడు అంకణాల ఇల్లు, 13 అంకణాల స్థలం కలిపి కొనుగోలు చేశారన్నారు. ఇల్లు శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్త ఇంటిని నిర్మించే ఆర్థిక స్తోమత లేక అలాగే వదిలేసామన్నారు. నాలుగేళ్ల క్రితం తన ఇంటి పక్కనే ఉన్న తన బంధువు టిఫిన్ దుకాణం పెట్టుకుంటానంటే తన తండ్రి అంగీకరించి అతనికి ఇచ్చారన్నారు. మూడేళ్ల క్రితం తన తండ్రి మరణించారని తెలిపారు. అదే అదునుగా భావించి పథకం ప్రకారం తన బంధువు తన ఇంటిని అతని పేరుపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ విషయం తెలుసుకున్న తాము ఇల్లు, స్థలము తమకు అప్పగించాలని బతిమిలాడినా తమను బెదిరించాడని వాపోయాడు. ఇప్పటికీ పంచాయతీ రికార్డులో ఇల్లు తన తండ్రి పేరుపై ఉన్నదన్నారు. పంచాయతీ అసెస్మెంట్ నెంబర్ 341 పై 20 24 వరకు తన తండ్రి పేరు పై ఇంటి పన్ను చెల్లిస్తూ వస్తున్నారని గుర్తు చేశారు. ఇప్పటికీ 26 సార్లు తన ఇంటి సమస్యపై అధికారులకు అర్జీలు ఇచ్చినా ఫలితం లేదని వాపోయారు. ఉన్నతాధికారులు ఈ విషయంలో కలుగజేసుకుని గ్రామంలో విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కొండా వంశీ వేడుకున్నారు.

# ఘనంగా మహానేత వైయస్సార్ జన్మదిన వేడుకలు

**మక్కువ, (రాజధాని వార్తలు):** ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిన జనహృదయనేత మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ అని జడ్పిటీసి సభ్యులు, కురుపాం పార్వతీపురం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు మావుడి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వైసీపీ క్యాంపు కార్యాలయంలో మండల వైసీపీ అధ్యక్షులు మావుడి రంగు నాయుడు ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రివర్యులు వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలు ఎన లేనివన్నారు. నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత వైయస్సార్‌కే దక్కుతుందన్నారు. పేద ప్రజల గుండెల్లో వైయస్సార్ చిరస్థాయిలో నిలిచిపోయారన్నారు. పేదవాడి సొంతింటి కల నెరవేరేలా ఇందిరమ్మ ఇంటి పథకాన్ని ప్రవేశపెట్టి పేద ప్రజలకు స్వగృహ కల నెరవేరేలా వైయస్సార్ కృషి చేశారన్నారు. వైసిపి కార్యకర్తలు వైయస్సార్ ఆశయాలను కొనసాగించి పేద ప్రజలకు అండగా నిలవాలన్నారు. అనంతరం కేక్ కట్ చేసి వైయస్సార్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు మావుడి రంగు నాయుడు, మండల వైసీపీ కార్యకర్తలు, వైయస్సార్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# బీసీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

## - కలెక్టర్ చేతుల మీదుగా హాస్టల్‌కు వాషింగ్ మెషీన్‌ను విరాళంగా అందజేసిన ఐటీ ఉద్యోగి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** స్థానిక ఫతేఖాన్‌పేటలోని ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల బుధవారం తనిఖీ చేశారు. మద్రాస్‌లో ఐటీ ఉద్యోగిగా పనిచేస్తున్న రాజేష్ పోలుదాసు సుమారు రూ.10 వేల విలువైన, 7 కిలోల సామర్థ్యం గల లాయిడ్ వాషింగ్ మెషీన్‌ను వసతి గృహానికి విరాళంగా అందజేయగా, జిల్లా కలెక్టర్ దానిని ప్రారంభించి దాతను అభినందించారు. అనంతరం వసతి గృహంలోని వివిధ సౌకర్యాలను పరిశీలించిన కలెక్టర్, అక్కడ నివసిస్తున్న విద్యార్థినుల వివరాలను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ మరియు సాధికారిత అధికారి పి. వెంకటలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం హాస్టల్‌లో 60 మంది కళాశాల విద్యార్థినులు ఉంటున్నారని, కొత్త అడ్మిషన్లు కొనసాగుతున్నాయని ఆమె వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో జిల్లా కలెక్టర్ ఆప్యాయంగా మాట్లాడారు. హాస్టల్‌లో ఏవైనా సమస్యలు లేదా ఇబ్బందులు ఉంటే నిర్భయంగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థినులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బైరి శ్రీనివాస్, చల్లగుంట్ల సాయిప్రసాద్, ముట్లూరు శ్రీహరి, పులపర్తి పెంచల ప్రసాద్, పచ్చ ప్రవీణ్ కుమార్, బీసీ బాలికల వసతి గృహ వార్డెన్ రిజ్వాన తదితరులు పాల్గొన్నారు.

# ఊటుకూరు నాగార్జున్ ఆధ్వర్యంలో ఘనంగా వై.ఎస్.ఆర్. జన్మదిన వేడుకలు





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** అపర భగీరథుడు మహానేత సంక్షేమ ప్రదాత స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి 77వ జయంతి వేడుకలు స్థానిక యలమవారిదిన్నెలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 13వ డివిజన్ కార్పొరేటర్ మరియు నెల్లూరు జిల్లా వైఎస్ఆర్సీపీ యువజన విభాగం అధ్యక్షులు ఊటుకూరు నాగార్జున్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందుగా రాజ్యాంగ నిర్మాత శ్రీ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలతో నివాళి అర్పించి తరువాత వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించి కేక్ కటింగ్ చేసి అభిమానులందరికీ పంచిపెట్టారు. అనంతరం నెల్లిపూడి సుబ్బరామయ్య నవకోటి మణి ఊటుకూర్తు మురళి మరియు ఊటుకూరు చైతన్యలు నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఊటుకూరు నాగార్జున్ మాట్లాడుతూ...అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సంక్షేమాల కోసం రాజశేఖరరెడ్డి ఒక అడుగు ముందుకు వేస్తే ఆయన తనయుడు వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి మరో అడుగు ముందుకు వేసి అభివృద్ధి సంక్షేమాలతో పాటు సచివాలయాలు వాలంటీర్ వ్యవస్థ ద్వారా వాటిని ప్రజల ముంగిట చేర్చారు. 2029లో జరిగే ఎన్నికలలో జగన్మోహన్ రెడ్డిని మళ్ళీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దానా హనుమంతు, పనికి ఓబులేసు, కైలాసం చిట్టిబాబు, రమేష్, సుబ్బారావు, అనిల్, మల్లిక, శాంతి, సరస్వతి, డొరొతి, వైఎస్ఆర్సీపీ నేతలు కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయడం జరిగింది.

# ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయం

## - కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు నియోజకవర్గ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే తమ ప్రధాన ధ్యేయమని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆమె వినతిపత్రాలను స్వీకరించారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే, సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.




# కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా విశాఖ దక్షిణ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆఫీస్‌లో నియోజకవర్గం ఇంచార్జి కేవీ. సూర్యనారాయణ ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఇంచార్జి మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా అనారోగ్య పేదలకు 108, విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, గ్రామీణలకు మహాత్మాగాంధీ పనికి ఆహార పథకం, ఆడపిల్లలకు కల్యాణలక్ష్మి ఇలా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారు అందుకే ఉమ్మడి రాష్ట్ర ప్రజలకు దేవుడయ్యారు అని అన్నారు. అనంతరం దక్షిణ నియోజకవర్గం జగదాంబ సెంటర్‌లో వున్న రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి డీసీసీ అధ్యక్షులు హాసిని వర్మరాజు చేతులమీదుగా పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు కస్తూరి వెంకటరావు, మైనారిటీ నాయకులు హరసద్ బాషా, సేవాదళ్ అధ్యక్షులు చెన్నా అప్పారావు, బీమిలి నియోజకవర్గం ఓబీసీ అధ్యక్షులు రజనీకాంత్, 30వ వార్డ్ అధ్యక్షులు సత్యనారాయణ, 37వ వార్డ్ అధ్యక్షులు కాకర అప్పారావు 39వ వార్డ్ అధ్యక్షులు షేర్ అలీ మరియు దక్షిణ నియోజకవర్గ కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నిఘంటువులు పంపిణీ




**రేణిగుంట, (రాజధాని వార్తలు):** రేణిగుంటలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతూ బిసి హాస్టల్లో ఉంటున్న విద్యార్థులకు బుధవారం సాయంత్రం యు ఎస్ ఏ లూయెనా ఫౌండేషన్ వారి ఆర్థిక సహాయంతో కడప జిల్లా ఖాజీపేటకు చెందిన పద్మ మహిళా మండలి ఆధ్వర్యంలో డిక్షనరీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పద్మ మహిళా మండలి ప్రాజెక్టు ఆఫీసర్ జూలియన్ రాజు మాట్లాడుతూ రేణిగుంట మండలంలోని పేద విద్యార్థులకు 450 డిక్షనరీలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఇంగ్లీష్ భాషపై ప్రతి ఒక్క విద్యార్థికి పట్టు ఉండాలన్న ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి డిక్షనరీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులు, జన విజ్ఞాన వేదిక నాయకులు వెంకట రమణ, పూర్వ విద్యార్థులు సంఘం ప్రధాన కార్యదర్శి జబ్బర్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# ఘనంగా వైఎస్సార్ 77వ జయంతి వేడుకలు






**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా కరప మండలం పలు గ్రామాల్లో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ అభిమానులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయన విగ్రహాలకు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. మండల కేంద్రం కరప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ) ఎదురుగా ఉన్న కులాయి చెరువు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రధాన కార్యక్రమంలో జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు, మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు చింత ఈశ్వరరావు తదితరులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, పీహెచ్సీలో బ్రెడ్ ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు, మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు చింత ఈశ్వరరావు మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాష్ట్ర రాజకీయ చరిత్రలో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహా నేత అని కొనియాడారు. ముఖ్యమంత్రిగా ఆయన చేపట్టిన సంక్షేమ పాలన లక్షలాది పేద కుటుంబాలకు అండగా నిలిచిందని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్ సేవలు, 104 వైద్య సేవలు, రైతులకు ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్మెంట్, ఇందిరమ్మ ఇళ్ల పథకం, జలయజ్ఞం వంటి అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాల ద్వారా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన నాయకుడిగా వైఎస్సార్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు.

రాష్ట్ర అభివృద్ధితో పాటు సామాజిక న్యాయం, రైతు సంక్షేమం, విద్య, వైద్యం రంగాలకు ఆయన చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతి నిధులు, వైఎస్సార్ అభిమానులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని మహానేతకు ఘనంగా నివాళులర్పించారు.

# కాయం సావిత్రమ్మ మృతికి మాజీ ఎమ్మెల్యే బియ్యపు సంతాపం



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి టౌన్‌లోని ప్రముఖ న్యాయవాది కాయం సుధాకర్ రెడ్డి మాతృమూర్తి కాయం సావిత్రమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె పార్థివదేహానికి శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమెకు నివాళులర్పించిన వారిలో రాయలసీమ కాలేజి అధినేత సుబ్బరామి రెడ్డి, శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జ్ఞానంబవారి మధు రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఆర్కాడు ముత్తు రెడ్డి, నాగోలు శివశంకర్ రెడ్డి, ఆర్కాడు హేమంత్, ఆర్కాడు కార్తీక్, ముద్దమూడి రవి, మహాదేవ కారిమేటి, యుగంధర్ తదితరులు వున్నారు.

# ఆపదలో ఉన్న మహిళలకు భరోసా కేంద్రాలుగా సఖి సెంటర్లు

## - సఖి సిబ్బందికి ట్రామా-ఇన్‌ఫార్మ్ కేర్‌పై అవగాహన సదస్సు ప్రారంభించిన రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సమాజంలో పలు రకాలుగా హింసకు గురైన మహిళలకు సఖి (వన్ స్టాప్ సెంటర్లు) కేంద్రాలు భరోసాగా నిలుస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర రాయపాటి శైలజ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్, జాతీయ మహిళా కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరులోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాల (జీజీహెచ్) లెక్చర్ గ్యాలరీలో 14 సఖి వన్ స్టాప్ కేంద్రాల సిబ్బందికి నిర్వహించిన "ట్రామా-ఇన్‌ఫార్మ్ కేర్, మానసిక ఆరోగ్యం, స్వీయ సంరక్షణ, హింసకు గురైన బాధితులకు సమర్థవంతమైన సేవలందించే విధానాలు" తదితర అంశాలపై అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.రాయపాటి శైలజ మాట్లాడుతూ, ఆపదలో ఉన్న మహిళలకు సఖి (వన్ స్టాప్ సెంటర్)లు చివరి ఆశ్రయ కేంద్రాలుగా పనిచేస్తున్నాయని తెలిపారు. ఒకే చోట వైద్య సేవలు, న్యాయ సహాయం, పోలీసు సహకారం, ఎఫ్ఐఆర్ నమోదు, కౌన్సిలింగ్ వంటి సమగ్ర సేవలను అందిస్తూ బాధిత మహిళలకు భరోసా కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. శారీరక వేధింపులు, లైంగిక దాడులు, గృహహింస, యాసిడ్ దాడులు వంటి వివిధ రకాల హింసకు గురైన మహిళలను అత్యంత సున్నితంగా, గౌరవప్రదంగా ఎలా సంప్రదించాలి, వారి మానసిక స్థితిని అర్థం చేసుకుని ఎలా సహాయపడాలి, తిరిగి మానసిక గాయం కలగకుండా (రీ-ట్రామాటైజేషన్) ఎలా సేవలు అందించాలనే అంశాలపై ఈ శిక్షణలో సమగ్ర అవగాహన కల్పించినట్లు వివరించారు. ఇలాంటి బాధాకరమైన కేసులను నిరంతరం నిర్వహించే సఖి సిబ్బంది కూడా తమ మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎంతో ముఖ్యమని, పని ఒత్తిడిని అధిగమిస్తూ సేవలను మరింత సమర్థవంతంగా అందించేలా స్వీయ సంరక్షణ పద్ధతులపై కూడా ఈ శిక్షణలో మార్గనిర్దేశం చేస్తున్నట్లు తెలిపారు. గుంటూరు నుంచి రాయలసీమ ప్రాంతం వరకు ఉన్న 14 జిల్లాల సఖి (వన్ స్టాప్ సెంటర్) లీగల్ అడ్వైజర్లు, కౌన్సిలర్లు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారని, వారి వృత్తి పరమైన సామర్థ్యాన్ని పెంపొందించి మహిళలకు మరింత



మెరుగైన సేవలు అందించడమే ఈ అవగాహన సదస్సు ప్రధాన ఉద్దేశమని డా.రాయపాటి శైలజ పేర్కొన్నారు. బాధిత మహిళలకు మరింత సానుభూతితో, మానవీయ దృక్పథంతో, సమర్థవంతమైన సేవలు అందించేందుకు సఖి (వన్ స్టాప్ సెంటర్) సిబ్బంది నిరంతరం తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం సదస్సులో పాల్గొన్న సఖి సిబ్బంది నిపుణులతో సందేహాలను నివృత్తి చేసుకుని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లపై చర్చించారు. తొలుత నెల్లూరు పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర మహిళా చైర్ పర్సన్ రాయపాటి శైలజకు నెల్లూరు ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్ ఘన స్వాగతం పలికారు. అనంతరం పలువురు మహిళలు తమ సమస్యలపై మహిళా కమిషన్ చైర్పర్సన్‌కు వినతి పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ అడ్వైజర్ రావూరి సూయజ్, సిబ్బంది మాధవీ లత, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, అడ్వకేట్ నాగరాజవర ప్రసాద్, డిఎస్పీ గిరిధర్, డాక్టర్ శరత్ కృష్ణ, డాక్టర్ ప్రసన్న లక్ష్మి తదితర నిపుణులు చట్టపర మైన, పోలీసు, మానసిక ఆరోగ్య అంశాలపై సఖి సిబ్బందికి శిక్షణ, అవగాహన కల్పించారు. 14 జిల్లాలకు చెందిన వన్ స్టాప్ సెంటర్ లీగల్ అడ్వైజర్లు, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan